ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 30.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 250 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

రాంచీలో నేడే తొలి వన్డే 12

కేసీఆర్ దీక్ష అక్షర సత్యం

- ఉద్యమ చరిత్రలో చరిత్మాత్మ ఘట్టం
- తెలంగాణ స్వాతంత్ర్యం కోసం సాగిన పోరు
- ఉద్యమకాలంలో పీసీసీ చీఫ్ ఎక్కడున్నారు?!
- ఈ రోజు చాలా మంది మాట్లాడుతున్నారు
- సోనియాకు ధన్యవాదాలు చెప్పిన సంస్కారం మాది
- హీరోలు మౌనంగా ఉంటే విలన్లు పోజులు కొడతారు
- త్యాగాలను, దీక్షలను మనం గుర్తుంచుకోవాలి
- 60 యేండ్ల చరిత్రతో తెలంగాణను ముంచింది కాంగ్రెస్సే
- దీక్షా దివస్ లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29: 'పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఉద్యమ కాలంలో ఎక్కడున్నారో ఎవరికి తెలియదు. ఆయన కూడా ఈ రోజు తెలంగాణ ఉద్యమం గురించి, కేసీఆర్ దీక్ష గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీనే స్వయంగా తెలంగాణ ఏర్పాటు ప్రకటన చేస్తూ కేసీఆర్ ప్రాణం ముఖ్యమైందని దీక్ష విరమించాలని వేడుకున్న విషయాన్ని కాంగ్రెస్ నేతలకు గుర్తు చేస్తున్నానని' కేటీఆర్ అన్నారు. తెలంగాణ బిడ్డల నెత్తురుతో కాంగ్రెస్ నేతల చేతులు తడిచాయన్నారు. 'తెలంగాణ కథలో ముమ్మాటికి కాంగ్రెస్ విలన్, శాశ్వత శత్రువు తెలంగాణకు కాంగ్రెస్ పార్టీయే. కేసీఆర్ అనే మూడు అక్షరాలు లేకుంటే తెలంగాణ లేదన్నది సత్యం. తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ చేసిన దీక్షను తక్కువ చేసి, అవమానకరంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు ఈ అంశాన్ని గుర్తుంచుకోవాలి. హీరోలు మౌనంగా ఉంటే విలన్లు కూడా మేమే హీరోలని ఫోజులు కొడతారు. అందుకే ఉద్యమంలో

..:: మిగతా 2లో

TELANGANA RISING GLOBAL SUMMIT

ఆర్థిక వృద్ధి, అన్నిరంగాల ప్రగతి, సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్మ్యాప్‌ను (సమ్మిట్ డాక్యుమెంట్) రెడీ చేశారు ఈ లక్ష్యాలను ప్రభుత్వం సంకల్పాన్నిప్రపంచ వేదికపై ప్రదర్శించడానికి తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహిస్తున్నామని, దీనికి తప్పకుండా తరలిరావాలని కోరుతూ ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలతో పాటు పలు దేశ అధ్యక్షులు, ప్రధానులకు సైతం ఆహ్వాన లేఖలు పంపించారు. తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించడం, పెట్టుబడులకు గమ్యస్థానంగా రూపొందిన ఇక్కడి వాతావరణం, విధానాలు, స్పష్టమైన లక్ష్యాలతో రాష్ట్ర అభివృద్ధి సాధన అంశాలను ఈ వేదికగా చాటి చెప్పాలన్నదే సీఎం రేవంత్ సంకల్పం.

వికసిత్ భారత్ అడుగుజాడలో

2047కు 'వికసిత్ తెలంగాణ' దిశగా

తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు

- ఫ్యూచర్ సిటీలో రాత్రింబవళ్లు పనులు
- 1500 ఎకరాలలో సకల సౌకర్యాలతో
- తెలంగాణ రైజింగ్‌సమ్మిట్‌డాక్యుమెంట్లు రెడీ
- తెలంగాణ సామర్థ్యం ప్రపంచానికి తెలిసేలా
- 9న ఆవిష్కరించనునకన సీఎం రేవంత్ రెడ్డి
- సమ్మిట్ లో పాల్గొననున్న దేశ, విదేశీ దిగ్గజాలు
- 3 వేల మంది ప్రతినిధులకు సరిపడా వసతులు
- ఇప్పటికే అందరికీ ఆహ్వానాలు అందజేత
- సమ్మిట్ కు వస్తామంటూ పలువురి సమ్మతి

మాణిక్యప్రభు గుర్రంపల్లి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో. హైదరాబాద్, నవంబర్ 29: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రకటించిన వికసిత్ 'భారత్' కు అనుగుణంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'వికసిత్ తెలంగాణ'పై దృష్టిసారించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచడం, రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'తెలంగాణ రైజింగ్ 2047' సమ్మిట్ సక్సెస్ కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ సమ్మిట్ లో ఆవిష్కరించబోతున్న డాక్యుమెంట్ రూపకల్పనపై పలు మార్లు సమీక్షలు, సమావేశాలు, చర్చించారు. ఈ సమావేశాలలో అధికారులకు విజన్ డాక్యుమెంట్ పై దశ,దిశానిర్దేశనం చేశారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో కొత్తగా 'భవిష్యత్ నగరాన్ని' (ఫ్యూచర్ సిటీ) ని దాదాపు 1500 ఎకరాలలో నిర్మించాలని తలపెట్టారు. ఈ భవిష్యత్ నగరాన్ని 'తెలంగాణ రైజింగ్ 2047' సమ్మిట్ ను ఇక్కడే నిర్వహించి సమ్మిట్ కు హాజరయ్యే

..:: మిగతా 2లో

శరవేగంగా రైల్వే ప్రాజెక్టులు

వచ్చే ఏడాదికి కాజిపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ పూర్తి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ఏకకాలంలో అనేక రైల్వే ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం పైన కేంద్రం దృష్టి సారించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు 75% పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టును వచ్చే ఏడాది నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

..:: 2లో

భవిష్యత్‌లో రాష్ట్ర జీఎస్డీపీ పెరగాలి

- తెలంగాణ విద్యుత్ అవసరాలు తీరాలి
- ఆ దిశగానే రాష్ట్ర సర్కారు చర్యలు
- విద్యుత్ డిమాండ్‌మేరకు ముందస్తు ప్రణాళిక
- అభివృద్ధి చెందిన దేశాలతోనే మన పోటీ
- మీడియాకు వివరించిన డిప్యూటీ సీఎం భట్టి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 29: భవిష్యత్తులో రాష్ట్ర జీఎస్డీపీని పెంచేందుకు అవసరమైన చర్యలను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కేబినెట్, ప్రజాప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో వెల్లడించారు. తెలంగాణ ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు పెద్ద ఎత్తున ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన చెప్పారు. ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చేసిన దేశాలతో పోటీపడేలా

..:: మిగతా 2లో

ముగిసిన తొలి విడత నామినేషన్లు

- 32 పంచాయితీలు 292 వార్డులకు ఎన్నికలు నిలిపివేత
- స్టే ఆర్డర్లు జారీ చేసిన న్యాయస్థానాలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, నవంబరు29 : తెలంగాణలో గ్రామ పంచాయితీ ఎన్నికలకు తొలి విడత నామినేషన్ల గడువు శనివారం సాయంత్రం

..:: మిగతా 2లో

ప్రపంచస్థాయికి తెలంగాణ వ్యవసాయం

'విజన్ డాక్యుమెంట్ 2047'లో అగ్రిచాప్టర్ నివేదిక

- భవిష్యత్తు వ్యవసాయ అభివృద్ధికి పునాది
- తెలంగాణలో వ్యవసాయ విస్తరణకు అపార అవకాశాలు
- వాటిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రణాళికలు రూపొందించాలి
- అధికారులకు మంత్రి తుమ్మల సూచనలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, నవంబర్29 : డిసెంబర్ నెలలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం "విజన్ డాక్యుమెంట్ 2047"ను ఆవిష్కరించడానికి సిద్ధమవుతోంది. ఈ విజన్ డాక్యుమెంట్ లో కీలక భాగంగా రూపొందుతున్న "తెలంగాణ వ్యవసాయ - 2047 అగ్రిచాప్టర్" భవిష్యత్తు వ్యవసాయ అభివృద్ధికి పునాది వేయనుంది. 2047 నాటికి తెలంగాణ వ్యవసాయం ఎలా ఉండాలి, దానికోసం ఏ విధమైన వ్యూహాలు, విధానాలు, మౌలిక సదుపాయాలు అవసరం, ఏ రంగాలు అత్యంత కీలకం అవుతాయి వంటి అంశాలన్నీ శాస్త్రీయంగా పరిశీలించి ఈ నివేదిక రూపొందించబడుతోంది. ఈ నివేదిక తయారీలో రాష్ట్రానికి చెందిన వ్యవసాయ, హార్టికల్చర్, రీసెర్చ్, మార్కెటింగ్ సంస్థల ఉన్నతాధికారులు, నిపుణులు సక్రియంగా పాల్గొంటున్నారు. తుది నివేదికపై చర్చించడానికి నేడు

..:: మిగతా 2లో

ఆ దేశాల నుండి వలసలు నిషేధం

వైట్ హౌస్ సమీపంలో కాల్పులు జరిగిన నేపథ్యంలో అమెరికా వ్యవస్థ సంపూర్ణంగా కోలుకునేందుకు వీలుగా థర్డ్ వరల్డ్ దేశాలు (పేద దేశాలు) అన్నిటి నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు.

11

కర్ణాటక వివాదానికి తాత్కాలి తెర

కర్ణాటక లో సీఎం పదవిపై గత కొంతకాలంగా కొనసాగుతున్న వివాదానికి ఇవాళ తాత్కాలికంగా తెరపడింది. అధిష్ఠానం జోక్యంతో ఇవాళ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య , డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేసుకున్నారు.

11



అన్‌మోల్ బిష్ణోయ్ కస్టడీ పొడగింపు

గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ ఎన్ఐఏ కస్టడీ ని మరో ఏడు రోజులు పొడిగించారు. ఈ నెల 19న విధించిన 11 రోజుల కస్టడీ గడువు నేటితో ముగియడంతో.. మరో ఏడు రోజులు కస్టడీ పొడిగించారు.

11

బిహార్‌లో బీజేపీ నేతపై కాల్పులు

గుర్తు తెలియని వ్యక్తులు బీజేపీ సీనియర్ నేతపై కాల్పులు జరిపారు. ఛాతిలోకి బుల్లెట్లు చొచ్చుకెళ్లిన ఆయనను హాస్పిటల్‌కు తరలించారు. ఆ బీజేపీ నేత ఆరోగ్య పరిస్థితి చాలా విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

11

రాష్ట్రీయం

భవిష్యత్‌లో రాష్ట్ర జీఎస్డీపీ పెరగాలి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించేందుకు బలమైన పునాదులు వేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా 2047 నాటికీ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించే లక్ష్యంతోముందుకు వెళుతున్న దశలోఅందుకు అనుగుణంగా విద్యుత్తు ప్రణాళికలను తయారు చేశామన్నారు. ఉత్పత్తి రంగాలు పెద్ద ఎత్తున వృద్ధి చెందితేనే వాటి ద్వారా ఉత్పత్తి భారీ స్థాయిలో పెరిగి రాష్ట్ర జీఎస్డీపీకి ఉపయోగపడతాయని, తద్వారా మన ఎకానమీ ఆశించిన స్థాయిలో పెరుగుతుందని అన్నారు. ఉత్పత్తి రంగాలైన తయారీ, వ్యవసాయ, సేవల రంగాలకు అవసరమైన నాణ్యమైన విద్యుత్ ను అందించడమే ప్రధానాశంగా ముందుకు వెళుతున్నట్లు చెప్పారు.

తెలంగాణ అభివృద్ధి చెందాలని

'ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడే విధంగా తెలంగాణ అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నాం. ప్రపంచంలోని వివిధ దేశాలలో తలసరి విద్యుత్ వినియోగానికి అనుగుణంగా తెలంగాణలో కూడా తలసరి విద్యుత్ వినియోగం పెంచడానికి ఆలోచన చేస్తూ ముందుకు వెళుతున్నట్లు భట్టి చెప్పారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో కంటే ఒకేసారి 10 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగిందని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబులు దావోస్ వెళ్లి వివిధ సంస్థలతో ఎంవోలు చేసుకోవడం విదితమే. అందులో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటు కానున్న డేటా, గ్లోబల్ సెంటర్స్ తో హైదరాబాద్ గ్లోబల్ హబ్ గా మారనుంది. అంతేకాక మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 2047కు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుందని, అందుకు అవసరమైన ఖచ్చితమైన ప్రణాళికతో ముందుకు పోతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ అధికారులు పాల్గొన్నారు.

యోగా ద్వారా ఆరోగ్యం పదిలం

- **స్పీకర్‌గడ్డం ప్రసాద్ కుమార్**
- **12వ తెలంగాణ యోగా చాంపియన్ షిప్‌ప్రారంభం**

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29: స్పోర్ట్స్ లాగానే యోగా పోటీలను నిర్వహించడం ద్వారా ఎక్కువ మంది ప్రజలకు యోగా గురించి తెలియజేయడంతో పాటుగా, సాధన చేస్తున్న వారికి ప్రోత్సాహాన్ని ఇవ్వవచ్చని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అభిప్రాయపడ్డారు. యోగా అనేది శారీరక వ్యాయామమే కాదు, ఒక జీవన విధానం కూడా, నేను గత నలభై సంవత్సరాలుగా రోజు యోగా సాధన చేస్తున్నానని దీంతో ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. రామాంతపూర్ అరోరా కాలేజీలో జరుగుతున్న 12వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లా యోగాసన చాంపియన్ షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి, అరోరా గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ రమేష్ బాబు, యోగా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, యోగా గురువులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా, రాష్ట్ర శాసన సభాపతి హోదాలో ఉండడంతో స్ట్రెస్ ను యోగా సాధన ద్వారా తగ్గించుకుంటున్నట్లు ప్రసాద్ కుమార్ తెలిపారు.యోగా అందరిదీ, ఇది ఒక మతానికో, ప్రాంతానికో సంబంధించినది కాదని, మంచి ప్రయోజనం ఇచ్చేది కాబట్టి అందరూ యోగాను ఆచరించవచ్చని సూచించారు.

యోగా ప్రాముఖ్యతను గుర్తించిన ఐరాస

ఈ మధ్య కాలంలో అమెరికా, యూరోప్, గల్ఫ్ దేశాలలోని ప్రజలు యోగా ప్రాక్టీస్ చేస్తున్నారని ప్రసాద్ కుమార్ తెలిపారు. ఆధునిక వైద్య విధానం నయం చేయలేని ఎన్నో అనారోగ్య సమస్యలు యోగా సాధన ద్వారా నయమయ్యాయన్నారు. ఐక్యరాజ్యసమితి సమితి యోగా ప్రాముఖ్యాన్ని గుర్తించి ప్రతి సంవత్సరం జూన్ 21 ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. యునెస్కో కూడా యోగాను సాంస్కృతిక వారసత్వంగా గుర్తించిందని తెలిపారు. యోగా వల్ల కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఆచరించాలని సూచించారు. యోగా, ధ్యానం నిత్యం సాధన చేయడం ద్వారా మనిషిలో ఒత్తిడి, ఆందోళనలు తగ్గి మానసికంగా ప్రశాంతంగా ఉంటారన్నారు. శారీరకంగా కూడా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. మానసికంగా ప్రశాంతంగా జీవించడానికి ప్రతి ఒక్కరు యోగాను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని ప్రసాద్‌రావు పిలుపునిచ్చారు.

రాజ్యాంగ హక్కుల బాధ్యతలు తెలుసుకోవాలి

- **హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయ చాన్సలర్ జస్టిస్ ఎల్.నరసింహ రెడ్డి**

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29: రాజ్యాంగ హక్కుల బాధ్యతలు తెలుసుకున్న రోజున వాటి ప్రాధాన్యత తెలుస్తుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయ చాన్సలర్ జస్టిస్ ఎల్.నరసింహ రెడ్డి తెలిపారు. కేంద్ర సమాచార శాఖ నేతృత్వంలో హైదరాబాద్ నారాయణ గూడ లోని కేశవ్ మెమోరియల్ కళాశాలలో రాజ్యాంగం పై ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ నెల 30 వరకు జరగనున్న ఈ ప్రదర్శనలో జంట నగరాల్లోని వివిధ లా కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ నరసింహ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం పై ప్రతి ఒక్కరికి స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత అని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులు కలిగి ఉన్నారని అన్నారు. సీబీసీ సహాయ సంచాలకులు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటో ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 30 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. గత 4రోజులుగా అనేక మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారని అన్నారు. విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు.

ఏపీకి కొత్త సీఎస్ గా సాయిప్రసాద్

- **2026 మార్చి 1 నుంచి బాధ్యతలు స్వీకరణ**
- **ప్రస్తుత సీఎస్ కె.విజయానంద్‌కు మూడు నెలల పదవీకాలం పొడిగింపు**
- **పది మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు ఇస్తూ మరో ఉత్తర్వు**

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (సీఎస్) గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయిప్రసాద్ నియమితులయ్యారు. ఆయన 2026 మార్చి 1వ తేదీ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పదవీకాలాన్ని ప్రభుత్వం మరో మూడు నెలల పాటు పొడిగించింది. దీనితో ఆయన 2026 మార్చి 28 వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ పొడిగింపునకు సంబంధించి జీవో నంబర్ 2230ను ప్రభుత్వం విడుదల చేసింది. మరోవైపు రాష్ట్రంలో పది మంది డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో ఆర్టీ నెంబర్ 2228ను ప్రస్తుత సీఎస్ విజయానంద్ విడుదల చేశారు. పరిపాలనాపరమైన ఈ మార్పులపై ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను జారీ చేయడంతో స్పష్టత వచ్చింది.

వికసిత్ భారత్ అడుగుజాడలో

మొదటిపేజీ తరువాయి

దేశ, ప్రపంచంలోని పారిశ్రామిక దిగ్గజాలకు, మేధావుల మన్ననలను పొందాలన్న తలంపుతో 'సమ్మిట్' ను ఫ్యూచర్ సిటీ నిర్మాణ ప్రాంతంలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్ మహానగర నిర్మాణంలో చేపట్ట బోయే నిర్మాణాలు, పరిశ్రమలు, రహదారులు తదితర విషయాలన్నీ తెలుపాలన్నదే సీఎం వ్యూహంలో భాగంగా సమ్మిట్ ఏర్పాటు స్థలాన్ని గుర్తించారంటూ మేధావులు సైతం అభిప్రాయపడుతున్నారు.

దార్శనిక పత్రం రెడీ

ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్‌మ్యాప్‌ను (సమ్మిట్ డాక్యుమెంట్) రెడీ చేశారు ఈ లక్ష్యాలను ప్రభుత్వం సంకల్పాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించడానికి తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహిస్తున్నామని, దీనికి తప్పకుండా తరలిరావాలని కోరుతూ ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలతో పాటు పలు దేశ అధ్యక్షులు, ప్రధానులకు సైతం ఆహ్వాన లేఖలు పంపించారు. తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించడం, పెట్టుబడులకు గమ్యస్థానంగా రూపొందిన ఇక్కడి వాతావరణం, విధానాలు, స్పష్టమైన లక్ష్యాలతో రాష్ట్ర అభివృద్ధి సాధన అంశాలను ఈ వేదికగా చాటి చెప్పాలన్నదే సీఎం రేవంత్ సంకల్పం. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు.

చురుకుగా సాగుతున్న ఏర్పాట్లు

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తికావొస్తున్న నేపథ్యాన్ని పురస్కరించుకుని తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. 'ఈ సమ్మిట్ కు తరలిరండి ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకోండి' అనే నినాదాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. దీనికి ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, టెక్నాలజీ రంగ నిపుణులు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే సమ్మిట్ ఏర్పాట్లను ప్రత్యేకంగా పరిశీలించారు. దీనితో పాటు అధికారులకు సమీక్షలపై సమీక్షలు నిర్వహించారు. సమ్మిట్ లో పాల్గొనాలంటూ దేశ విదేశాలకు చెందిన దాదాపు 3,000 మంది ప్రముఖులను ప్రభుత్వం ఆహ్వానించింది.

వస్తున్నామంటూ పలువురి లేఖలు

ఈనెల 9న తెలంగాణ రైజింగ్ 2047 సమ్మిట్ కు ఆహ్వానాలు అందుకున్న పలువురు దిగ్గజాలు వస్తున్నట్లు ప్రభుత్వానికి సమాచారం ఇస్తున్నారు. ఇందులో భాగంగా బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్ర, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు, వివిధ కంపెనీల అంతర్జాతీయ స్థాయి సీఈఓలు సదస్సుకు హాజరవుతున్నట్లు సమాచారం అందజేశారు. యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్ రాజవంశానికి చెందిన ఎమిరేట్స్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్స్ డైరెక్టర్ షేక్ తారిక్ బిన్ ఫైజల్ అల్ ఖసిమి, రస్ అల్ ఖైమా ప్రతినిధులు దుయిష్ బోర్సే, గ్రూప్ హెడ్ లుడ్విగ్ హెంజిల్మెన్, ఎన్రిషన్ వ్యవస్థాపక భాగస్వామి విన్ స్టన్, మాండయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ సీఈఓ బెన్నెట్ నియోతో పాటు పలు టెక్ కంపెనీల సీఈవోలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులు ఈ సదస్సులో పాల్గొనడానికి ఇప్పటికే సంసిద్ధతను తెలియజేసినట్లు సమాచారం.

తెలంగాణ రైజింగ్ విజన్-2047 పాలసీ అంటే

విదేశాలతో పోటీ పడేలా, రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా 'తెలంగాణ రైజింగ్ విజన్2047 పాలసీ' డాక్యుమెంట్ ఉండాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యం. తెలంగాణ రైజింగ్ 247 పాలసీలుంటాయి. ఈ పాలసీ ద్వారా తెలంగాణ సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలని భావిస్తున్నారు. పాలసీ అంటే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మార్గసూచిక. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఒక దీర్ఘకాలిక మార్గ సూచిక అని ముఖ్యమంత్రి దూరదృష్టితో రూపొందించారు. స్వాతంత్రం వచ్చి వంద సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ప్రపంచ దేశాల ముందు పెట్టాలన్న ఉద్దేశంతో తెలంగాణ రైజింగ్ 2047 పాలసీని తీసుకొస్తున్నారు. ఈ పాలసీ లక్ష్యం 2034 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడం, 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకు వెళ్లడం ప్రధాన లక్ష్యంగా ఈ పాలసీని రూపొందించారు.దీనితో పాటు దేశ స్థూల జాతీయోత్పత్తికి తెలంగాణ నుండి 10 శాతం వాటాను అందించడం కూడా ఇందులో లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజల భాగస్వామ్యంతో తెచ్చిన పాలసీ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని ప్రాంతాల వారీగా విభజించి, ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేసేలా ప్లాన్ చేశారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ.. ఇలా మూడు రీజియన్లుగా విభజించారు. మానవ వనరుల అభివృద్ధి పైన, మౌలిక సదుపాయాల కల్పన పైన, సామాజిక సంక్షేమం పైన, ప్రజల భాగస్వామ్యంతో రూపొందించిన పాలసీగా దీనిని తీసుకురానున్నారు.

కేసీఆర్ దీక్ష అక్షర సత్యం

మొదటిపేజీ తరువాయి

భాగస్వాములైన ప్రతి ఒక్కరూ నాటి ఉద్యమ ఘట్టాలను, దీక్షా దివాస్ ప్రాధాన్యతను మరోసారి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. తెలంగాణ ఏర్పాటు తర్వాత సోనియా గాంధీకి ధన్యవాదాలు చెప్పిన సంస్కారం మాది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిరి ఏనాడు తెలంగాణ బలిదేవత సోనియా గాంధీ అని మేము అనలేదు. మమ్మల్ని అవమానపరిస్తే ఊరుకుంటాం కానీ, తెలంగాణను, అటు తెలంగాణ ఉద్యమాన్ని అవమానపరిస్తే ఊరుకునేది లేదు. 60 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో ప్రతిసారి తెలంగాణను ముంచింది కాంగ్రెస్ పార్టీనే. 1950 నుంచి 2025 వరకు తెలంగాణ తొలి శత్రువు, విలన్ కాంగ్రెస్ పార్టీనే. ఆనాటి నుంచి ఈనాటి దాకా తెలంగాణ ప్రజా ప్రతినిధులను పార్టీలో కలుపుకొని మోసం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీనే. దమ్ముంటే చేర్చుకున్న పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని' కేటీఆర్ సవాల్ విసిరారు.

తెలంగాణ ఉద్యమాల కోసం

'తెలంగాణ ప్రజలు ఉద్యమాల కోసం, ప్రజల కోసం నిలబడిన వీరులు. 60 యేండ్ల పాటు బానిసలుగా ఉన్నది కాంగ్రెస్ పార్టీ నాయకులే. తల్లి తెలంగాణను తీసివేసి కాంగ్రెస్ బొమ్మను పెట్టుకున్నది కాంగ్రెస్ బానిసలే. సచివాలయం ముందున్న రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తీసి తల్లి తెలంగాణ విగ్రహం బరాబర్ పెడతాం' అని కేటీఆర్ ప్రకటించారు. 'దీక్షా దివాస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమాన్ని, అమరవీరుల త్యాగాలను, ప్రజల పోరాటపటిమను గుర్తుచేసుకొని మరోసారి పునరంకితం కావాల్సిన అవసరం ఉన్నది. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు చేసిన ద్రోహాన్ని, అమరుల ప్రాణాలు తీసుకున్న తీరుని, తెలంగాణకు నిరంతరం చేస్తున్న ద్రోహాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉన్నది' అంటూ కేటీఆర్ సుదీర్ఘంగా తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన ఉద్యమ చరిత్రను, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి ప్రస్థానానికి సంబంధించిన అనేక అంశాలను వివరించారు. 'సాధారణంగా ప్రతి 30 సంవత్సరాలకు ఒకసారి తరం మారుతుందని, వారి ఆలోచన విధానం మారుతుందని అయితే, ప్రతి తరం తన ఏడు తరాల కథను తెలుసుకోవాలని' కేటీఆర్ చెప్పారు. ఎన్నో యుగాలు దాటిన తర్వాత కూడా రామాయణ, మహాభారతంలోని హీరోలు ఎవరు, విలన్లు ఎవరు, పాండవులు ఎవరు, కౌరవులు ఎవరు, రాముడెవరు, రావణుడెవరో అన్ని రకాల అంశాలు ఇప్పటి తరానికి గుర్తున్నాయి అంటే కేవలం గత చరిత్రను పదే పదే మననం చేసుకోవడం వల్లనే అని కేటీఆర్ అన్నారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన దశాబ్దాల చరిత్రను, అందులోని విలన్లను, హీరోలను, పోరాట వీరులను, వారి త్యాగాలను, వారి దీక్షలను గుర్తుంచుకోవాలని, దీక్షా దివాస్ కి సంబంధించిన ప్రాధాన్యతను వివరించారు. ఒకవేళ మతెలంగాణ అమర వీరులకు మౌనం పాటించి నివాళులు అర్పించిన కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, బండ ప్రకాష్, ఎమ్మెల్సీలు వానిదేవి, దాసోజు శ్రవణ్ , ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, నగర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన తొలి విడత నామినేషన్లు

మొదటిపేజీ తరువాయి

ముగిసింది. మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్లు స్వీకరించారు. ఆదివారం నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్ల వివరాలు వెల్లడిస్తారు. సోమవారం అప్పీళ్ల స్వీకరణ, వచ్చే నెల 2న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. వచ్చే నెల 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు వెల్లడిస్తారు. నామినేషన్ల సందర్భంగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా, మొదటి దశ నామినేషన్ల గడువు ముగియడంతో రెండో విడత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఆదివారంనుంచి ప్రారంభం కానుంది.

292 వార్డులకు, 32 పంచాయతీలకు ఎన్నికలు లేవు

న్యాయస్థానాలు వివిధ కేసుల్లో జారీ చేసిన స్టే ఆర్డర్లతో 32 గ్రామపంచాయతీలు, 292 వార్డుల్లో ఎన్నికల నిర్వహణను రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపివేసింది. ములుగు జిల్లా మంగపేట మండలంలోని 25, కరీంనగర్ జిల్లా వి.సైదాపూర్ మండలంలోని 2, ఖమ్మం జిల్లా ఎన్కూరు మండలంలోని 4 గ్రామ పంచాయతీలను, పెనుబల్లి మండలంలోని ఒక గ్రామ పంచాయతీని ఎన్నికల నోటిఫికేషన్ నుంచి మినహాయించింది.

ప్రపంచస్థాయికి తెలంగాణ వ్యవసాయం

మొదటిపేజీ తరువాయి

ఉన్నతాధికారులతో వ్యవసాయ, మార్కెటింగ్, హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నివేదికపై పలు కీలక సూచనలు చేస్తూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దే ప్రభుత్వ లక్ష్యంతో వ్యవసాయరంగం సరిసమానంగా అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. రైతు కేంద్రీకృత ప్రణాళికలు, రైతు ఆదాయం పెంపు, ఉత్పాదకతలో నాణ్యతా ప్రాముఖ్యత, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి అంశాలను ప్రధానంగా చేర్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. తెలంగాణలో వ్యవసాయ పరిశోధన మరియు విస్తరణ కార్యకలాపాలకు అపార అవకాశాలున్నాయని, వాటిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. పంటల ఉత్పాదకత పెంపు, పంటల వైవిధ్యకరణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ప్రణాళిక, నీటి వినియోగ సామర్థ్య పెంపు, వంటి ఆధునిక పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో చోటుచేసుకుంటున్న కొత్త సాంకేతికతలను త్వరగా అన్వయించగలిగితే తెలంగాణ వ్యవసాయ రంగం మరింత శక్తివంతం అవుతుందని అన్నారు.

అలాగే, రైతులు పండించే ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, విలువ జోడించే అగ్రి-ప్రాసెసింగ్ వ్యవస్థలను విస్తృతంగా అభివృద్ధి చేయడం అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణను ప్రపంచస్థాయి విత్తనోత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయడానికి గ్లోబల్ సీడ్ హబ్‌గా తీర్చిదిద్దాలని, నాణ్యమైన విత్తన ఉత్పత్తులు, సర్టిఫికేషన్ వ్యవస్థలు, ఎగుమతి ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే హార్టికల్చర్ మెగా క్లస్టర్లు ఏర్పాటు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను పెంచేందుకు ప్రత్యేక ట్రేడింగ్ వింగ్‌ల ఏర్పాటు, డిజిటల్ వాటర్ ఇంటెలిజెన్స్ డేటాబేస్‌లు, బయో-ఇన్ఫర్మేటిక్స్ సెంటర్లు వంటి ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలని ఆయన వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, వ్యవసాయ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, వ్యవసాయ వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ జానయ్య , ఉద్యానవర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ రాజిరెడ్డి పాల్గొన్నారు

శరవేగంగా రైల్వే ప్రాజెక్టులు

- **వచ్చే ఏడాదికి కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ పూర్తి**
- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 29: ఏకకాలంలో అనేక రైల్వే ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం పైన కేంద్రం దృష్టి సారించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు 75% పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టును వచ్చే ఏడాది నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం కాజీపేటలోని రైల్వే తయారీ యూనిట్‌ను కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం సాకారమవుతోందని అన్నారు. 2023లో కాజీపేటలో రైల్వే తయారీ యూనిట్ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారని, పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి సంబంధించి కీలక విషయాలు చెప్పిన కిషన్ రెడ్డి రూ. 521 కోట్ల వ్యయంతో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును అమలు చేస్తోందన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో జరుగుతున్న వివిధ విభాగాల నిర్మాణాల తీరు తెన్నులను వివరించారు. ఆర్ఎంయూలో 16 కోచ్ ఎంఈఎంయూలో రేక్‌లను తయారు చేయాలని ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. రాబోయే రైల్వే తయారీ యూనిట్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలు అభివృద్ధిని సాధిస్తున్నాయన్నారు. ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు వందే భారత్ రైళ్లు, కొత్త రైళ్లు, అమృత్ స్టేషన్లు, విద్యుదీకరణ తదితర పనులు శరవేగంగా జరుగుతున్నాని తెలిపారు. అంతకుముందు కిషన్ రెడ్డి వరంగల్ రైల్వే స్టేషన్ ను పరిశీలించారు. స్టేషన్లో అందిస్తున్న ప్రయాణికుల సౌకర్యాలపైన అధికారులతో సమీక్షించారు. తెలంగాణలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనుల పైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏకకాలంలో 40 రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

వరి ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తుంది. 51 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 11 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశాం. ఇందుకు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.2,300 కోట్లు జమ చేశాం. అవసరాన్ని బట్టి మార్చి వరకు ధాన్యం కొనుగోళ్లు కొనసాగిస్తాం.
- ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్

అంతర్జాతీయ ఫేక్ కాల్ ముఠా అరెస్ట్

- ఆస్ట్రేలియా పౌరులే టార్గెట్‌గా మోసాలు
- కాల్‌సెంటర్‌పై పోలీసుల దాడులు
- రెండేళ్లలో రూ.8 నుంచి 10 కోట్లు కాజేసిన ఘనులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29: ఇంటర్నేషనల్ ఫేక్ కాల్ సెంటర్ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఆస్ట్రేలియా పౌరులను టార్గెట్‌గా చేసుకొని ఈ ముఠా మోసాలకు పాల్పడుతోంది. ఏకంగా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుని మరీ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. నకిలీ కాల్ సెంటర్ ముఠా మోసాలకు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు చెక్ పెట్టేశారు. నకిలీ కాల్ సెంటర్‌పై సంయుక్తంగా దాడులు చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ సుధీంద్ర మీడియాతో మాట్లాడుతూ.. నగరంలోని మాదాపూర్‌లో నకిలీ కాల్ సెంటర్‌పై దాడులు చేసి.. సైబర్ నేరాలకు పాల్పడుతున్న 9 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. వీరంతా రిడ్జ్ ఐటీ సొల్యూషన్ పేరుతో కాల్ సెంటర్ నడుపుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. 12 కంప్యూటర్లు, 21 మొబైల్ ఫోన్లు, టీపీ లింక్ రౌటర్, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు గత 2 సంవత్సరాలుగా ఫేక్ కాల్ సెంటర్ నడుపుతూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని.. 2 ఏళ్లలో 8 నుంచి 10 కోట్లు ఆస్ట్రేలియా పౌరులు నుంచి దోచుకున్నారని సైబర్ క్రైమ్ డీసీపీ వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఆరుగురు కలకత్తాకు చెందిన వారు ఉన్నారని తెలిపారు. ఆస్ట్రేలియాలో చదువుకునే ఇండియా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్స్‌ను కొనుగోలు చేసి ఇండియా నుంచి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఆస్ట్రేలియా బ్యాంక్ అకౌంట్స్ ద్వారా సైబర్ నేరాలకు పాల్పడటంతో ఇండియాలో ఉన్న నిందితుల్ని గుర్తించడం కష్టంగా మారిందని అన్నారు. ఆస్ట్రేలియా భాషలో మాట్లాడటానికి ప్రత్యేకంగా ఇక్కడ కాల్ సెంటర్‌లో ట్రైనింగ్ ఇస్తున్నారని వివరించారు. నిందితుల్లో ఎక్కువగా కలకత్తాకు చెందిన వారు ఆరుగురు ఉండగా.. ఖమ్మంకు చెందిన గణేష్, కేశవ్ వ్యక్తులు ముందు ఉండి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని విచారణలో బయట పడిందని సైబర్ క్రైమ్ డీసీపీ తెలిపారు.

మరో ఆరుగురు అరెస్ట్...

మరోవైపు.. సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ అకౌంట్లను సమకూరుస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. నలుగురు ఏపీకి చెందినవారు కాగా, ఇద్దరు తెలంగాణ వ్యక్తులు కలిసి మొత్తం ఆరుగురు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా జరిగిన సైబర్ మోసాలలో 400 సైబర్ నేరాలలో వీళ్ళ ప్రమేయం ఉందన్నారు. సైబరాబాద్ పరిధిలో మూడు కేసులు వీరిపై నమోదై ఉన్నాయని తెలిపారు. ఆరుగురు నిందితులు మూడు విడతలుగా సైబర్ నేరగాళ్లకు అకౌంట్లను సమకూరుస్తున్నారని.. ఇందు గాను మూడు విడుతల్లో కమిషన్ తీసుకుంటున్నారన్నారు. ప్రతి స్టేజ్‌లో కమిషన్‌ను సైబర్ నేరగాళ్ల నుంచి నిందితులు పొందుతున్నారని తెలిపారు. మొదటి విడతలో బ్యాంక్ అకౌంట్ సమకూరిస్తే రూ.10,000 కమిషన్ తీసుకుంటున్నారని.. రెండో విడతలో కోటి రూపాయల ట్రాన్సాక్షన్స్‌కు లక్ష రూపాయలను నిందితులు కమిషన్‌గా తీసుకుంటున్నట్లు చెప్పారు. నిందితుల వద్ద నుంచి ఏడు మొబైల్ ఫోన్లు, 11 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నామని సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ సుధీంద్ర పేర్కొన్నారు.

గ్రిడ్ స్టెబిలిటీ కోసం థర్మల్ ప్రాజెక్టు నిర్మాణం

- అవగాహన లేకుండా మాట్లాడకండి
- ప్రతిపక్షాల విమర్శలకు శ్రీధర్ బాబు కౌంటర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29 : రామగుండం, పాల్వంచ, మక్తల్లలో మూడు కొత్త థర్మల్ పవర్ ప్లాంట్లను నిర్మించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను మంత్రి శ్రీధర్ బాబు ఖండించారు. గ్రిడ్ స్టెబిలిటీ కోసం థర్మల్ ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నామని, ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇవాళ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన శ్రీధర్ బాబు మాట్లాడుతూ సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని గతంలో కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసిందని గుర్తు చేశారు. సబ్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ స్థానంలో సూపర్ క్రిటికల్ ప్లాంట్ ఏర్పాటుకు కోరామన్నారు. హిట్ హెడ్ వద్దనే థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనేది మా ప్రభుత్వ లక్ష్యం అని జెన్ కో స్థలంలో తక్కువ ధరకు ఇచ్చే సంస్థకే నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. దీనిపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. పచ్చ కామెర్లు ఉన్న వారికి లోకమంత పచ్చగానే కనిపించినట్లుగా ప్రతిపక్షాల విమర్శలు చేస్తున్నాయన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు
రూ. 707.30 కోట్లు విడుదల

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29: ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు సంభంసించిన రూ. 707.30 కోట్లు విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం బట్టి పక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ సీఎం ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు నవంబర్ నెలకు సంబంధించి రూ.707.30 కోట్ల పెండింగ్ బిల్లులను శనివారం విడుదల చేశారు. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలో భాగంగా ప్రతినెల రూ. 700 కోట్లకుపైగా నిధులను విడుదల చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగా ఈనెల రూ. 707.30 కోట్లను ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఆర్థిక శాఖ విడుదల చేసింది. నవంబర్ తో వరుసగా నాలుగు నెలలుగా ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల బకాయిలను చెల్లిస్తూ వస్తోంది. ఇందులో గ్రాట్యుటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్స్, అడ్వాన్స్‌లకు సంబంధించిన బిల్లులు ఉన్నాయి.

సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఏర్పాటు!

- హైదరాబాద్ సీపీ సజ్జనార్ నిర్ణయం
- కీలక కేసులను సీఐటీకి బదిలీ చేసేలా చర్యలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబరు29: హైదరాబాద్ పోలీసు శాఖ మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీఐటీ (సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్ సీపీ సజ్జనార్సన్నాహాలు చేస్తున్నారు. సెన్సేషనల్ కేసులతో పాటు కీలక కేసులను సీఐటీకి బదిలీ చేసేలా చర్యలు తీసుకోనున్నారు. సాధారణ కేసులతో సంబంధం లేకుండా సీఐటీ టీమ్ ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం అవుతుందని పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు . కేసు దర్యాప్తు దగ్గర నుంచి కోర్టులో ఛార్జ్ షీట్స్, ట్రయల్ వరకు సీఐటీ టీమ్ మానిటర్ చేసే విధంగా అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

తెలంగాణ వచ్చాక లబ్ధిపొందింది కేసీఆర్ కుటుంబమే

- కరోనా వైద్యాన్ని ఆరోగ్య శ్రీలో చేర్చాలంటే కేసుపెట్టారు
- అధికారంలో ఉంటే ఒక్క రోజు దీక్ష దివస్
- అధికారం పోయిందన్న ఆందోళనలో దీక్ష దివస్‌పదిరోజులు
- బీఆర్ఎస్ నేతల తీరుపై మంత్రి సీతక్క ఆగ్రహం

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29: కొట్లాడి, ప్రాణాలు పణంగా పెట్టి సాధించుకున్న తెలంగాణాలో కేసీఆర్‌కుటుంబమే లబ్ధిపొందిందని, ఏ ఒక్కరికి కూడా లబ్ధి జరగలేదని పంచాయితీరాజ్, మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. కరోనా సమయంలో అందిస్తున్న వైద్యాన్ని ఆరోగ్య శ్రీ లో పెట్టాలని కోరినందుకు అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయంలో నమోదైన కేసు విచారణ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. బీఆర్ఎస్ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయన్నారు. దోచుకున్న డబ్బులతో బీఆర్ఎస్ నాయకులు ఎన్ని కార్యక్రమాలైనా చేస్తారని విమర్శించారు. మేం చెప్పినట్టే రాష్ట్ర ప్రజలు వినాలి అనేలా బీఆర్ఎస్ నాయకులు అప్పుడు, ఇప్పుడు ప్రవర్తిస్తున్నారంటూ మండిపడ్డారు. దీక్షా దివస్ పేరుతో బీఆర్ఎస్ చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరు అని మంత్రి సీతక్క అన్నారు. కరోనా ట్రీట్మెంట్ ను ఆరోగ్య శ్రీ లో చేర్చాలన్నందుకు బీఆర్ఎస్ హయంలో తమ మీద కేసు నమోదైందని వివరించారు. కరోనా టైంలో సామాన్య ప్రజలు ఖరీదైన ట్రీట్‌మెంట్ చేసుకోలేరని ఆరోగ్య శ్రీ లో చేర్చాలన్నామని, పేద ప్రజల ప్రాణాల కోసమే ఇందిరాపార్క్ దగ్గర నిరహార దీక్ష చేసామని గుర్తు చేశారు. తదుపరి విచారణను డిసెంబర్ 18 కు కోర్టు వాయిదా వేసిందని తెలిపారు. కోర్టుల మీద నమ్మకం ఉంది, విచారణకు పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. దీక్ష బీఆర్ఎస్ దీక్షా దివాస్ ను ఉద్దేశించి మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ అంటూ నిర్వహించారని, అధికారం పోయిన తర్వాత పది రోజులపాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడాల్సిన అవసరం ఏంటి ? అని ఆమె ప్రశ్నించారు. ప్రజలకు పదేండ్లలో చేసిన అభివృద్ధి ఏంటో దీక్షా దివస్ లో చెప్పాలని సీతక్క డిమాండ్‌చేశారు.

క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ.. పొంతన లేని గణాంకాలు

- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబుపై మాజీ మంత్రి హరీష్ ఫైర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29: తెలంగాణలో విద్యుత్ రంగంలో ప్రస్తుత పాలనపై మాజీ మంత్రి హరీశ్ రావు డిప్యూటీ సీఎం విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. భట్టి విడుదల చేసిన రాష్ట్ర పవర్ సెక్టార్ శ్వేతపత్రం, ఇటీవల ప్రస్తావించిన "క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ2025" ప్రదర్శించిన గణాంకాలన్నీ సరైన అవగాహన లేకుండా, ఒకదానితో ఒకటి విరోధంగా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. 2023 డిసెంబర్ 1 నాటికి భట్టి విక్రమార్క అందించిన శ్వేతపత్రం ప్రకారం సోలార్ కెపాసిటీ 6,123 మెగావాట్లు ఉండగా, మొత్తం కాంట్రాక్టెడ్ కెపాసిటీ 19,475 మెగావాట్లు అని పేర్కొన్నారు. కానీ 2025 జనవరి 11 నాడు విడుదలైన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ప్రకారం కరెంట్ ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 5,415 మెగావాట్లు మాత్రమే, అప్‌కమింగ్ ప్రాజెక్టులు 2,474 మెగావాట్లు, మొత్తం 7,889 మెగావాట్లు మాత్రమే ఉన్నట్లు చూపించారు. "2023లో 6,123 మెగావాట్లు ఉంటే, 2025కి 5,415 మెగావాట్లు ఎలా తగ్గిపోయాయి?" అని ఆయన ప్రశ్నించారు. తదుపరి గణాంకాల ప్రకారం, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ పేజీ 8లో తెలంగాణ కరెంట్ కాంట్రాక్టెడ్ కెపాసిటీ 26,212 మెగావాట్లు, 2029-30కి 49,104 మెగావాట్లు, 2034-35కి 66,694 మెగావాట్లు చేరనున్నట్లు తెలిపింది. కానీ, థర్మల్ పవర్ ఉత్పత్తి లక్ష్యాల్లో భట్టి విరుద్ధమైన గణాంకాలను ప్రస్తావిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. "2025 పాలసీ ప్రకారం 203435కు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి 16,966 మెగావాట్లుగా ఉంటుంది, ప్రస్తుతం అందుబాటులో 14,164 మెగావాట్లు మాత్రమే. అందువల్ల లోటు 2,802 మెగావాట్లు ఉండాలి. కానీ మీరు ఇప్పుడు 5,000-6,000 మెగావాట్ల లోటు ఉందని చెబుతున్నారు. ఇది ఎలా సాధ్యమయ్యింది?" అని ప్రశ్నించారు. 2030 నాటికి 20,000 మెగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ లక్ష్యంతో, రాబోయే ఐదేళ్లలో 13,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఏర్పాటు కావలసిన పరిస్థితి ఉన్నప్పటికీ, భట్టి గారు కొత్త థర్మల్ పవర్ ప్రాజెక్టుల కోసం ముందుకు వెళ్లడం అనవసరమని, "50,000 కోట్ల బడ్జెట్ కోసం 3040 శాతం కమీషన్ కోసం మాత్రమే" ప్లాంట్ నిర్మాణం జరుగుతున్నట్లు ఆయన ఆరోపించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు ఖర్చుల విషయంపై హరీశ్ రావు ప్రత్యేకంగా లెక్కలు చూపించారు. శ్వేతపత్రం ప్రకారం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఒక్క మెగావాట్‌కు 8.64 కోట్లు, ఎన్టీపీసీ రామగుండం ప్లాంట్ 7.63 కోట్లు ఖర్చు అయ్యింది. భట్టి నేడు రామగుండం పవర్ ప్లాంట్ 14కోట్లు ఖర్చు అవుతుందని చెబుతున్నారని, కానీ నిజానికి 12.3 కోట్లు మాత్రమే వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

జీఎంసీ బాలయోగి స్టేడియంలో
తొలిసారిగా గ్లోబల్ మోటర్‌స్పోర్ట్స్

- ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్ లీగ్ రౌండ్ 2 పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్
- హాజరుకానున్న సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29: ప్రపంచంలోనే మొట్టమొదటి ఫ్రాంచైజీ ఆధారిత సూపర్‌క్రాస్ రేసింగ్ లీగ్ అయిన ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్ లీగ్ (ఐఎస్ఆర్ఎల్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ క్రీడలకు తమ ప్రభుత్వం మద్దతు, ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు సీఎం వెల్లడించారు.. హైదరాబాద్‌లో జరగనున్న, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐఎస్ఆర్ఎల్ రౌండ్ 2 డిసెంబర్ 6, 2025న జరుగనుంది. ఐఎస్ఆర్ఎల్ సహ వ్యవస్థాపకులు , బిగ్‌రాక్ మోటర్‌స్పోర్ట్స్ సహ యజమాని సమక్షంలో, గౌరవనీయులైన ముఖ్యమంత్రి గచ్చిబౌలిలోని ఐకానిక్ జీఎంసీ బాలయోగి అథ్లెటిక్స్ స్టేడియంలో జరగనున్న లీగ్ యొక్క డిసెంబర్ 6, 2025 న జరపటానికి ప్రణాళిక చేసిన రెండవ రౌండ్ పోస్టర్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. తొలిసారిగా భారీ స్థాయిలో ప్రపంచ సూపర్‌క్రాస్ రేసింగ్ ను తెలంగాణ నిర్వహిస్తోంది, ఇందులో అంతర్జాతీయ అథ్లెట్లు, ప్రపంచ స్థాయి రేసింగ్ మౌలిక సదుపాయాలు, అభిమానులకు అద్భుతమైన క్రీడా అనుభవం భాగంగా ఉంటాయి. హైదరాబాద్‌లో ఐఎస్ఆర్ఎల్ రాక రాష్ట్ర దార్శనిక బ్లూప్రింట్, తెలంగాణ రైజింగ్ 2047 కు అనువుగా ఉంటుంది, ఇది క్రీడలు, పర్యాటక రంగంతో సహా పలు రంగాలలో ఆవిష్కరణ, యువత అనుసంధానిత ,శ్రేష్ఠతను పెంపొందించే లక్ష్యంతో ఉంది.

బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా ఐఈఎల్టీఎస్‌శిక్షణ తరగతులు

- అంతర్జాతీయ స్కాలర్షిప్ లు పొందేలా స్టడీ సర్కిల్లో శిక్షణ
- బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29 : తెలంగాణ రాష్ట్రంలోని బీసీ, ఇతర విద్యార్థులకు విదేశాలలో ఉన్న అత్యున్నత విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలను, అంతర్జాతీయ స్కాలర్షిప్లు పొందడం లక్ష్యంగా నిర్మాణాత్మక అవగాహన సెషన్లు, శిక్షణా కార్యక్రమాలను తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ప్రారంభించడం జరుగుతుందని బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రం లోని 12 బీసీ స్టడీ సర్కిల్స్ లో విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలను వివరించేందుకు అవగాహన కార్యక్రమాలను, ఐఈఎల్టీఎస్‌శిక్షణ తరగతులు ప్రారంభించడం జరుగుతుందని వెల్లడించారు. ఇందుకుగాను అవగాహన కార్యక్రమాలకు, శిక్షణ తరగతులుకు హాజరయ్యేందుకు ఆసక్తి వున్న గ్రాడ్యుయేషన్ (ప్రొఫిషనల్ మరియు నాన్ (ప్రొఫెషనల్) ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు వచ్చే నెల 1 నుంచి 21 వరకు టీజీబీసీ స్టడీ సర్కిల్ వెబ్సైట్ www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరింత సమాచారం 04024071178 ద్వారా తెలుసుకోవచ్చని బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

చట్టం ముందు అందరూ సమానులే

- జిల్లా ఎస్సీ, ఎస్టీ డీవీఎంసీ సభ్యురాలు కల్పన

ప్రతిపక్షం, సికింద్రాబాద్, నవంబర్ 29: భారత రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు మనుషులందరూ సమానమేనని, ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్ష పాటిస్తే శిక్షలు తప్పవని హైదరాబాదు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యురాలు పులి కల్పన అన్నారు. గురువారం మారేడుపల్లి తహసీల్దారు కార్యాలయం అధ్వర్యంలో అజాద్ చంద్రశేఖర్ నగర్ లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాదు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యురాలు పులి కల్పన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో దూషించినా, బొనాలు తదితర ఉత్సవాలలో వివక్ష పాటించినా చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ పథకాలను హక్కుగా అమలు చేయాలన్నారు. చట్టాలు, పథకాలపై అవగహన పెంపొందించుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, తహసీల్దారు కార్యాలయం అధికారులు, బీఎస్పీ నాయకులు జోగు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- మంత్రి పొంగులేటికి ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత
- త్వరలో సంఘాలతో సమావేశమై పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మంత్రి

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్29: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూకే.ఎఫ్) రాష్ట్ర కమిటీ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. శనివారం హైదరాబాద్లోని సచివాలయం మంత్రి చాంబర్లో టీడబ్ల్యూజేఎఫ్ సీనియర్ ఉపాధ్యక్షులు, రాష్ట్ర అడ్ హాక్ కమిటీ కన్వీనర్ పి.రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య, ఉపాధ్యక్షులు పి. రాధిక, గుడిగ రఘు, బి.రాజశేఖర్, కార్యదర్శి ఈ చంద్రశేఖర్, హెచ్ యూ జే అధ్యక్షులు బి అరుణ్ కుమార్, నాయకులు అచ్చిన ప్రశాంత్ తదితరులు మంత్రిని కలిశారు. దాదాపు గంటపాటు జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. వెంటనే అక్రిడిటేషన్లు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో కొత్త ఆరోగ్య కార్డులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇండ్లస్థలాల విషయంలో కొత్త విధానం తీసుకురావాలని మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇండ్లస్థలాల సమస్యలతో జర్నలిస్టు సంఘాలు, సీనియర్ జర్నలిస్టుతో సమావేశం నిర్వహించి పరిష్కరించాలని అన్నారు. చనిపోయిన జర్నలిస్టులకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సూచించారు. మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట పనిచేసే చోట నుంచి ఇంటివరకు రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ వసతిని ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమటీలు ఏర్పాటు చేయాలనీ, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి అటాక్స్ కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి త్వరలో జర్నలిస్టుల సంఘాలతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. అంతకుముందు సమాచార శాఖ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డిఎస్ జగన్ కు సైతం వినతి పత్రాలు అందజేశారు.

"రాష్ట్రంలో గ్రిడ్ కుప్పకూలితే రోజుకు రూ.2,000 కోట్ల వరకు నష్టం వస్తుంది. జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా గ్రిడ్ నమ్మకాన్ని పరిరక్షించడానికి 5,000-–6,000 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను తప్పనిసరిగా పెంచాలి. లక్ష్యాలను చేరుకునేందుకు పవర్ డిమాండ్‌కు అనుగుణంగా ఏటా 8.5% పవర్ గ్రోత్ ఉంటుంది. 2047 నాటికి ఇది 10 శాతానికి చేరుతుంది.

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఓపెన్ వాయిస్

గ్లోబల్ సమ్మిట్‌తో 'రేవంత్ రైజింగ్'!!

సీదీ బాత్

ఎస్ కే జకీర్
9052631212

హైదరాబాద్ నగరంలో తలపెట్టిన 'గ్లోబల్ సమ్మిట్' రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయం. ఇలాంటి అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం సాధారణ విషయం కాదు. దీన్ని సక్సెస్ ఫుల్ గా నిర్వహించడం ముఖ్యమంత్రి రేవంత్ కు పెద్ద ఛాలెంజ్. ముఖ్యమంత్రిగా రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరుగుతున్న ఈ సమ్మిట్ నిస్సందేహంగా ప్రతిష్ఠాత్మకమైనది.పరిపాలన అనుభవం లేదని, అధికారయంత్రాంగంపై పట్టు సాధించలేదని బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రచారానికి ఈ సమ్మిట్ చెంపపెట్టు. రేవంత్ రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా అనూహ్యంగా ఉంటున్నాయి. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడం అయినా, విద్యావ్యవస్థను సంపూర్ణంగా ప్రక్షాళన తలపెట్టడం అయినా, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణమయినా, అన్నీ ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ ను, తెలంగాణభవన్ ను వణికిస్తున్నవే. 'ఇంతింతయి వటుడింతై' అన్నట్టుగా ఒక్కసారి మంత్రిగా పని చేసిన అనుభవం లేకపోయినా సరే, ప్రజా పాలనతో మెరుపులు మెరిపిస్తున్నారు. ప్రత్యర్థులకు అంతు చిక్కని వ్యూహాలు రచించడంలో, ఎత్తుగడలు అమలు చేయడంలో కేసీఆర్ కు మించిన వారెవరూ లేరన్న మాట ఇక గతం. రేవంత్ కేసీఆర్ ను ఎప్పుడో ఓవర్ టేక్ చేశారు. అలా చేసి ఉండకపోతే జూబ్లీహిల్స్ ఫలితం కాంగ్రెస్ కు అనుకూలంగా వచ్చేది కాదు. తెలంగాణకు బ్రాండుకు చార్మినార్, గోల్కొండ, హైటెక్ సిటీ ఎలాగో భవిష్యత్తులో ఫ్యూచర్ సిటీ కూడా బ్రాండుగానే నిలుస్తుందని ఎన్నో కార్యక్రమాలలో సీఎం రేవంత్ వివరించారు. ఎక్కడికి వెళ్లినా సీఎం ఫ్యూచర్ సిటీని ప్రచారం చేస్తూ అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు

దావోస్ తరహాలో ఏర్పాట్లు చేయాలని, దేనికీ వెనకాడవద్దని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో పనులు ఊపందుకున్నాయి. ప్రతిరోజు వెయ్యి మంది కార్మికులతో అధికారులు సమ్మిట్ పనులు నిర్వహిస్తున్నారు. టీజీఐఐసీ, ఫ్యూచర్ సిటీ ఎండీ శశాంక, కలెక్టర్ నారాయణరెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు నిత్యం అక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టే భారీ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రజెంటేషన్లు డిసెంబర్ 8, 9 తేదీలలో ఇవ్వనుంది. పెట్టుబడుదారులతో అవగాహన ఒప్పందాలు చేసుకోవడంతో పాటు భూములు కేటాయింపులు కూడా చేయనుంది. రైజింగ్ తెలంగాణ విజన్ 2047 డాక్యుమెంట్‌తో పాటు ఫ్యూచర్ సిటీకి సంబంధించిన సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేయనుంది. వివిధ రంగాలకు సంబంధించి పెట్టుబడులను ఆకర్షించేందుకు కొత్త పాలసీలను విడుదల చేయనుంది.

దావోస్ తరహాలో ఏర్పాట్లు చేయాలని, దేనికీ వెనకాడ వద్దని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో పనులు ఊపందుకున్నాయి. ప్రతిరోజు వెయ్యి మంది కార్మికులతో అధికారులు సమ్మిట్ పనులు నిర్వహిస్తున్నారు. టీజీఐఐసీ, ఫ్యూచర్ సిటీ ఎండీ శశాంక, కలెక్టర్ నారాయణరెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు నిత్యం అక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టే భారీ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రజెంటేషన్లు డిసెంబర్ 8, 9 తేదీలలో ఇవ్వనుంది. పెట్టుబడుదారులతో అవగాహన ఒప్పందాలు చేసుకోవడంతో పాటు భూములు కేటాయింపులు కూడా చేయనుంది. రైజింగ్ తెలంగాణ విజన్ 2047 దాక్యుమెంట్‌తో పాటు ఫ్యూచర్ సిటీకి సంబంధించిన సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేయనుంది. వివిధ రంగాలకు సంబంధించి పెట్టుబడులను ఆకర్షించేందుకు కొత్త పాలసీలను విడుదల చేయనుంది. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలతో డిసెంబరు 10, 11వ తేదీలలో సదస్సులు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు సమయం దగ్గరపడుతుండడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వేలాది మంది హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని పర్యవరణ హితంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని,అవసరమైన చోట సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడాలని అధికారులను ఆదేశించింది.ఈ అంతర్జాతీయ సదస్సుకు దేశ, విదేశాల నుంచి దాదాపు 1,300 ప్రముఖ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరు కానుండడంతో అందరినీ ఆకర్షించే విధంగా అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

సువిశాల సభా ప్రాంగణం

గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేసే అతిథులను ఆకట్టుకునేలా దాదాపు 100 ఎకరాల ప్రధాన ప్రాంగణంతో పాటు ఇతర ప్రాంగణాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రాంగణం మొత్తాన్ని వృత్తాకర డిజైన్‌లో తీర్చిదిద్దుతున్నారు. 32 భాగాలుగా విభజించి 5 నుంచి 6 వేల మంది కూర్చునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన ప్రాంగణంలో 2,500 సీట్లు అమరుస్తున్నారు. ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ప్రధాన ప్రాంగణం పక్కనే అదే సైజులో డైనింగ్ హాల్ ,సీఎం లాంజ్ పక్కనే వీవీఐపీ లాంజ్ ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రీనరీ పనులన్నీ హెచ్ఎండీఏకి అప్పగించారు. ఈ సదస్సుకు ప్రపంచ నలుమూలల నుంచి ప్రముఖులు హాజరుకానున్నందున వీరి కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని ప్రముఖ హోటళ్లలో సుమారు వెయ్యి గదులు బుక్ చేస్తున్నారు. అతిథులను ఈ ప్రాంగణానికి తీసుకువచ్చేందుకు వేయి అద్దె బస్సులు, మూడు హెలీపాడ్‌లు, మూడు హెలీకాప్టర్లు సిద్ధం చేస్తున్నారు. డిసెంబర్ 3 కల్లా దాదాపు ఏర్పాట్లు పూర్తిచేసి 4, 5వ తేదీలలో ట్రయిల్ రన్ కూడా నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నారు. హెలిప్యాడ్ నుంచి ప్రధాన ప్రాంగణం సుమారు కిలోమీటర్ దూరం ఉండడంతో ఇక్కడ కూడా ఆరు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పారిశ్రామికవేత్తలను ఫ్యూచర్‌సిటీ అథారిటీ కమిషన్ కార్యాలయంతో పాటు స్కిల్ యునివర్సిటీ భవన నిర్మాణాలు, అమెజాన్ డాటా కేంద్రాల పరిశీలనకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

స్వయంగా సీఎం రేవంత్ పర్యవేక్షణ

గ్లోబల్ సమ్మిట్ కోసం తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. పాస్ లు లేకుండా సమ్మిట్ కు ఎవరైనా ఎంట్రీ కావడానికి వీల్లేదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సమ్మిట్ కు సంబంధం లేని వారికి ఎట్టి పరిస్థితులలోనూ ఎంట్రీ ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అధికారులకు శాఖలవారీ ఎంట్రీ ఉంటుందని అన్నారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రే స్వయంగా పరిశీలిస్తున్నారు. బందోబస్తుకు వచ్చే పోలీసు సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నవి. మీడియాకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు సమ్మిట్‌కు పారిశ్రామిక వేత్తలు, టెక్నాలజీ రంగ నిపుణులతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. దేశ విదేశాలకు చెందిన దాదాపు మూడు వేల మంది ప్రముఖులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది.

పెట్టుబడులకు గమ్యస్థానం

దేశీయ పెట్టుబడులకు తెలంగాణ అత్యంత అనుకూల గమ్యస్థానమని, ఐటీ, ఏరోస్పేస్, తయారీ, ఫార్మా రంగాలకు మంచి ఎకో సిస్టమ్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్టు పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.'అత్యంత ప్రతిభావంతులైన యువత రాష్ట్రంలో ఉన్నందున నైపుణ్యాలకు కొదువలేదు. జర్మనీ – తెలంగాణ భాగస్వామ్యంలో వాణిజ్యం, పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలా సహకరిస్తాం. పరిశ్రమ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పరిశోధన, వినూత్న ఆవిష్కరణల కోసం ప్రత్యేక ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని పారిశ్రామిక శిక్షణ కేంద్రాలన్నింటినీ అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నాం.లైఫ్ సైన్సెస్ రంగంలో నూతన ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్ కోసం జీనోమ్ వ్యాలీలో ఇటీవలే '1 బయో'ను ఏర్పాటు చేశాం. ఫార్మా ఉత్పత్తుల్లో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉండగా కొత్తగా ఏరోస్పేస్, రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు దాన్ని అధిగమించాయి. రూ.1,300 కోట్లతో ఫ్రెంచ్ కంపెనీ సాఫ్రాన్ విమాన ఇంజన్ల మెయింటెనెన్స్,రిపేర్, ఓవర్ హాలింగ్ కేంద్రాన్ని నెలకొల్పింది.రఫేల్ యుద్ధ విమానాల మరమ్మతులు, ఓవర్ హాలింగ్ ఇక్కడే జరుగుతాయి' అని మంత్రి వివరించారు.

ప్రపంచదేశాలతోనే తెలంగాణ పోటీ

పెట్టుబడుల ఆకర్షణ,ఉపాధి కల్పనలో తాము మిగిలిన రాష్ట్రాలతో పోటీ పడటం లేదని, తమ పోటీ దేశాలతోనే అని సీఎం రేవంత్ రెడ్డి పలు సందర్భాలలో చెప్పిన విషయాన్ని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. ఇదిలా ఉండగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన సమ్మిట్ కు ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత అభిజీత్ బెనర్జీ రానున్నారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్లు దువ్వూరి సుబ్బారావు,రఘురామ్ రాజన్,బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, కేంద్ర మాజీ ఆర్థిక ముఖ్య సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్,రామన్ మెగసెసె అవార్డు విజేత విల్సన్,ప్రముఖ ఆర్థికవేత్త సంతోష్ మెహరోత్రా, ప్రముఖ పర్యావేరణ శాస్త్రవేత్త అరుణ ఘోష్, ఐక్యరాజ్యసమితి సలహా మండలి సభ్యులు జయతి ఘోష్‌లను కూడా ఆహ్వానిస్తుంది. తెలంగాణ సమగ్రాభివృద్ధికి కావాల్సిన సూచనలు,సలహాల కోసం ప్రభుత్వం నిపుణులతో ఓ సలహామండలిని కూడా ఏర్పాటు చేసింది. ఫ్యూచర్ సిటీలో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ,వివిధ శాఖల కేంద్ర మంత్రులను ఆహ్వానించాలని సీఎం రేవంత్‌రెడ్డి అనుకుంటున్నట్టు తెలుస్తోంది.

ఎప్పటి నుంచో తెలంగాణకు బ్రాండ్ ఇమేజ్

కాగా 'గ్లోబల్ సమ్మిట్'లో తెలంగాణ గతం, వర్తమానం,భవిష్యత్తు కనిపించాలి .బ్రాడింగ్ భవిష్యత్‌పై విశ్వాసం కల్పించేలా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ జరగాలి. అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేలా ఉండాలి. అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ నిలిచేలా ఈ సమ్మిట్ నిర్వహించాలి' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డిసెంబరు 8,9 తేదీలలో ఫ్యూచర్‌సిటీలో నిర్వహించే సమ్మిట్ గురించి ఆయన నిరంతరం సమీక్షిస్తున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ విభాగాలవారీగా చేపట్టే పనులకు సంబంధించి ప్రతి అంశం ప్రచారంలో ప్రముఖంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి సంకల్పించారు. అటు పెట్టుబడిదారులకు కల్పించే సదుపాయాలను సమగ్రంగా వివరించాలని సీఎం దిశానిర్దేశం చేస్తున్నారు. హైదరాబాద్ కు అనుకూల అంశాలైన ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగు రోడ్డు, రానున్న రీజినల్ రింగురోడ్డు, అటు బందరు పోర్టు వరకు నిర్మించనున్నగ్రీన్‌ఫీల్డ్ హైవే, రైలు మార్గం, డ్రైపోర్ట్‌తోపాటు తెలంగాణ కళా, సాంస్కృతిక, భాష, వాతావరణ అనుకూలతను వివరించాలని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 1999 నుంచి ఇప్పటివరకు ఎన్నిప్రభుత్వాలు మారినా విధానపరమైన నిర్ణయాలలో ఎలాంటి మార్పులేని అంశాన్ని వివరించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణ బ్రాడింగ్‌కు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయాలతో దెబ్బతింటున్నదంటూ కేటీఆర్, హరీశ్ రావు గడచిన రెండేండ్లుగా గగ్గోలు పెడుతూనే ఉన్నారు. కానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే తెలంగాణ ప్రాంతానికి అనేక విధాలుగా ప్రత్యేకతలున్నాయి. రాష్ట్రానికే పరిమితమైన వైవిధ్య రామప్ప ఆలయంలోని నంది, సమ్మక్క- సారలమ్మ జాతర, నల్లమల పులులు, మహబూబ్‌నగర్ జిల్లాకే ప్రత్యేకమైన ఎద్దులు, జాతీయ- రాజకీయాలను శాసించిన పీవీ నరసింహారావు వంటి యోధులు, కళాకారులు, క్రీడాకారులు, అంతర్జాతీయ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్న ప్రముఖుల వలన ఇదివరకే హైదరాబాద్ నగరానికి ఒక 'బ్రాండ్ ఇమేజ్' ఉన్నది. అయితే, రాష్ట్ర విభజన తర్వాత, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పడే 'బ్రాండ్' వచ్చిందని బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం బూటకమని పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు పలుమార్లు ఖండించారు.

సదస్సులో అనేక ఆకర్షణలు

'తరలిరండి – ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకోండి' అన్న నినాదంతో ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న సమ్మిట్‌కు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేయర్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్‌స్విడర్ ,పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు, వివిధ కంపెనీల అంతర్జాతీయ స్థాయి సీఈఓలు సదస్సుకు హాజరు కానున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. యూఏఈ రాజవంశానికి చెందిన, ఎమిరేట్స్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్స్ డైరెక్టర్ షేఖ్ తారిక్ బిన్ ఫైజల్ అల్ ఖసిమి,రస్ అల్ ఖైమా ప్రతినిధులు,డుయిష్ బోర్సే గ్రూప్ హెడ్ లుడ్విగ్ హింజెల్మన్ , ఎన్రిషన్ వ్యవస్థాపక భాగస్వామి విన్స్టన్,మాండయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ సీఈఓ బెన్నెట్ నియోతో పాటు పలు టెక్ కంపెనీల సీఈవోలు,పెట్టుబడిదారులు,స్టార్టప్ వ్యవస్థాపకులు ఈ సదస్సులో పాల్గొనడానికి సంసిద్ధతను తెలియజేశారు.'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనిక పత్రాన్ని ప్రభుత్వం తయారు చేసింది. ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, సంక్షేమం,సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్ తెలంగాణకు తగు రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది.ఈ లక్ష్యాలను, ప్రభుత్వం సంకల్పాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు ఈ సమ్మిట్ జరుగుతోంది. తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించడం, పెట్టుబడులకు గమ్యస్థానంగా రూపొందిన ఇక్కడి వాతావరణం,విధానాలు, స్పష్టమైన లక్ష్యాలతో రాష్ట్ర అభివృద్ధి సాధన అంశాలను ఈ వేదికగా చాటి చెప్పాలని ప్రభుత్వం సంకల్పించింది. డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ 2047 దాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తారు. 13న ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం,గ్రెటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (GOAT) లియోనెల్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పాల్గొనే వేడుకలోనే ప్రత్యేక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ఇది ప్రత్యేక ఆకర్షణగా, ముగింపు ఘట్టంగా నిలువనుంది

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com

అచ్చమైన మట్టికవి బెల్లి యాదయ్య

డా. అట్టెం దత్తయ్య
9494715445

కవికి ఒక సామాజిక అస్తిత్వం, ఒక భావజాలం, ఒక ఉద్యమం, ఒక ప్రాంతం, ఒక భాష అనేవి ఉంటాయి. వీటితో పాటు జీవిత స్మృతులు కూడా కనిపిస్తాయి. కవి వేరు, కవిత్వం వేరు కాదు. కవిచుట్టూ ఉన్నవన్నీ తన కవిత్వంలో ఉంటాయి. అవే కవిత్వం అవుతాయి. ఏది ముందు, ఏది తర్వాత కవిత్వంగా మారుతుందనేది చెప్పలేం. కొన్నిసార్లు ఏకకాలంలో అవన్నీ వ్యక్తమవచ్చు. అంతర్లీనంగా ఉన్న భావాలను సమాజం కదిలించినపుడు, కవిత్వం చేసి కవి బలంగా విసురుతాడు. ఎందుకంటే కవికి కవిత్వం ఒక్కటే ఆసరా. కవిత్వాన్ని ఆసరా చేసుకునే అనేక సంఘటనల పట్ల స్పందించడం కవి తన బాధ్యతగా భావిస్తాడు. అలా భావించిన వాడే అసలైన కవి. ఆ జాబితాలో నిలబడగలిగిన కవి బెల్లి యాదయ్య. ఆయన తన అస్తిత్వానికి కవిత్వపు గోసికట్టి 'నేను గొర్రెలు కాస్తుంటాను' అన్నారు. సమాజ తీరును చూసి 'బోధివృక్షం' అయి ప్రజల పక్షాన నిలబడ్డారు. మోసంతో కలిసి ఉండలేక 'విభాజకం' అయ్యారు. తండ్రి ఎడబాటుతో వచ్చిన కన్నీటిని అక్షరంగా 'తర్జుమా' చేసుకున్నారు. మాయమౌతున్న అచ్చమైన పల్లెను గుర్తుచేసుకుని 'మా ఊరు అట్లా లేదు' అని విచారం వ్యక్తం చేసారు. ఈ మధ్య 'కల వస్తే బాగుండును' అని కోరుకుంటూ ఆరు కవితా సంపుటాలను ముద్రించి ప్రజలకు అందించాడు.

చుట్టూ చూసిన పల్లె జీవితం

కవి అనుభవించిన వేదన, ఆనందం, చుట్టూ చూసిన పల్లె జీవితం, మానవ సంబంధాల సౌందర్యం, విలువల క్షీణత అన్నీ కలసి కవిత్వాన్ని సృష్టిస్తాయి. తెలుగు సాహిత్యంలో పల్లె మనిషి వేదనను, బహుజన తత్వాన్ని, మానవీయ బంధాలను ఆత్మీయంగా కవిత్వీకరించిన బెల్లి యాదయ్య కవిత్వం ఆధునిక తెలుగు సాహిత్యానికి మానవీయ కోణాన్ని చూపింది. ఆయన కవిత్వంలో ఉన్న సాహిత్య సిద్ధాంతాల మేళవింపు వ్యక్తిగత అనుభవం నుంచి సామాజిక అన్వయానికి, తాత్విక చింతన నుంచి నిర్మాణ సమతుల్యత వరకు విస్తరించినట్లు కనిపిస్తుంది. సాహిత్య చరిత్రలో కవుల తరం మారినప్పుడల్లా వారి భావ ప్రకటన పద్ధతి కూడా మారుతుంది. వర్గవాదం నుంచి రొమాంటిసిజం,ఆధునికవాదం నుంచి పోస్ట్ మోడ్రనిజం వరకు సాహిత్య పరిణామం మానవ ఆలోచనల మార్పును ప్రతిబింబించింది. బెల్లి యాదయ్య కవిత్వంలో మనకు కనిపించే దృక్పథం పోస్ట్ మోడ్రన్ హ్యూమనిజానికి దగ్గరగా ఉంటుంది. వ్యక్తి అనుభవాన్ని సమాజపు దుఃఖంతో కలిపి చూపించడం ఆయన సాహిత్య స్వభావం. ఆయన సాహిత్యం సోషల్ రియలిజానికి కూడా దగ్గరగా ఉంటుంది.

సాహిత్యంలో స్త్రీవాద స్పృహ కూడా

యాదయ్య సాహిత్యంలో స్త్రీవాద స్పృహ కూడా ఒక అంతర్భాగంగా ద్యోతకమౌతుంది. తల్లి పట్ల ఉన్న కృతజ్ఞత, స్త్రీ పట్ల ఉన్న గౌరవం, దాంపత్యానికి విలువనివ్వడం, తండ్రి తన తల్లిని 'ఏనాడూ పల్లెత్తు మాట అనని' మనిషిగా చూపడం వంటి వాటి ద్వారా కవి కుటుంబ సంబంధాల గౌరవాన్ని పక్షపాతం లేకుండా జెండర్ సమానత్వాన్ని కూడా పాటించాగలిగారు. కవి తండ్రిని 'చెట్టు, నది, పొలం, ఎద్దు అన్నీ కలిసిన సమాహారం' గా అభివర్ణించడం విశ్వ సమదృష్టికి దగ్గరగా ఉంటుంది. మట్టితో, ఆవులతో, చెట్లతో, పంటలతో ఆయన సంబంధం కేవలం కవిత్వ సంబంధం కాదు. అది సాంస్కృతిక వాస్తవికత. ఆయన కవిత్వం రైతు జీవనంలోని ఆత్మకు కూడా అద్దం పడుతుంది. మట్టిని తల్లిగా, పొలాన్ని పుణ్యక్షేత్రంగా, ఎద్దును దైవంగా భావించడం ఆయన కవిత్వంలో ఉన్న ప్రజాతాత్వికతకు నిదర్శనం. సమాజంలోని విభేదాలను, అన్యాయాన్ని, బహుజన తత్వాన్ని కవిత్వంలో ప్రతిబింబించడం ఆయన సామాజిక దృష్టి. పల్లె ప్రజలు రాసుకోలేని చరిత్రను ఆయన కవిత్వం ద్వారా రాసారు. ఇది సబాల్టర్న్ కోణం. బెల్లి యాదయ్య కవిత్వంలో ఉపయోగించిన 'మంద నా గురుకులం, కొండ కోన నా తరగతి గది' వంటివి అధికారిక విద్యని తిరస్కరించి, ఇండిజీనియస్ నాలెడ్జ్ సిస్టాన్ని ప్రతిపాదిస్తాయి. అతని సాహిత్యం ఒక జీవన పాఠం కూడా. కుటుంబం ఇచ్చిన విలువలు, కష్టం, సత్యనిష్ఠ, ప్రేమ, దాతృత్వం ఇవన్నీ నైతిక మానవతావాదాన్ని తెలియజేస్తాయి. "కష్టం చేయకుండా ఏదీ రాదు, వచ్చినా మనకొద్దు" అనేటటువంటి కవిత పాదాలు నిజాయితీగా బతకడం, విలువలతో ఉండడం వంటి అంశాలను నేర్పుతాయి.

మనిషిని ప్రకృతితో, కుటుంబాన్ని సమాజంతో

బెల్లి యాదయ్య కవిత్వం మనిషిని ప్రకృతితో, కుటుంబాన్ని సమాజంతో, అనుభవాన్ని తత్వంతో, భాషను జీవంతో కలిపింది. అదే అవసరమైన, నిజ సాహిత్య తత్త్వం. ఇలాంటి సాంద్రత కలిగిన కవిత్వాన్ని విశ్లేషిస్తూ తగుళ్ల గోపాల్, పల్లిపట్టు నాగరాజు, డాక్టర్. ఇమ్మిడి మహేందర్, డా. సాగర్ల సత్తయ్య, రాము, విజయ్, విప్లవ్ లాంటి ఏడుగురు యువ రచయితలు, పరిశోధకుల వ్యాసాలతో 'శూద్రకవి, డా. బెల్లి యాదయ్య కవిత్వ విశ్లేషణ' అనే పుస్తకాన్ని పదం ప్రచురణలు, పాలెంవారు వెలువరిస్తున్నారు. పుస్తకంలో రాసిన ఈ ఏడు వ్యాసాలు బెల్లి యాదయ్య కవిత్వాన్ని అన్ని కోణాలలో ఆవిష్కరించాయి. వారు అధ్యయనం చేసి అనుశీలించిన వ్యాసాలు వేటికవే సాటి. ఒక రకంగా ఈ వ్యాసాలన్ని ఈ తరం యువకుల ఆలోచనలనుండి యాదయ్యను అంచనా వేశాయి. అన్ని వ్యాసాలలో కూడా కొత్త సిద్ధాంతాలను అప్లై చేసిన విధానం, వారు అనుభవపూర్వంగా లీనమై రాసిన తీరు కూడా కనిపిస్తుంది. ఈ వ్యాస రచయితలలో ఎక్కువ శాతం కవి భావజాలం, కవి సామాజికం, కవి ప్రాంతం, కవిని దగ్గరినుండి చూసినవారు కావడం వల్ల కూడా కవిని స్వంతం చేసుకున్న విధానం, తన్మయత్వం పొందిన తీరు స్పష్టంగా కనిపిస్తుంది.

(నవంబర్ 30 ఆదివారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ నల్లగొండలో 'శూద్రకవి - బెల్లియాదయ్య' పుస్తకావిష్కరణ సందర్భంగా)

(వ్యాస రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్వీ కళాశాల, న్యూఢిల్లీ)

సీఎం ఆలోచనలకు అనుగుణంగానే

స్మార్ట్ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ఫెసిలిటీ ప్రారంభం

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ప్రతిపక్షం, సిటి బ్యూరో , నవంబర్ 29 : సీఎం ఆలోచనలకు అనుగుణంగానే గ్రోయింగ్, హ్యాపెనింగ్ సిటీ హైదరాబాద్ లోనీ అత్యంత రద్దీగల కెబిఆర్ పార్క్ వద్ద ఆటోమేటెడ్ స్మార్ట్ కార్ పార్కింగ్ సౌకర్యంను ఏర్పాటు చేశామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. కేబిఆర్ పార్క్ వద్ద జీహెచ్ఎంసీ,నవ నిర్మాణ్ అసోసియేట్స్ సంయుక్త అధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆటోమేటెడ్ స్మార్ట్ కారు పార్కింగ్ ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి , అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి, స్థానిక కార్పొరేటర్ వెంకటేష్ లతో కలిసి ప్రారంభించారు. మేయర్ వాహనంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి,ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి లు కూర్చుని ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ కార్ పార్కింగ్ లో పార్క్ చేసే విధానం , పనితీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ కు పేరుందన్నారు. ఈ మహా నగరం సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక కార్యక్రమాలను చేపడుతున్నారని మేయర్ కొనియాడారు. వారి ఆలోచనలకు అనుగుణంగానే జీహెచ్ఎంసీ అధునాతన మల్టీ లెవెల్ స్మార్ట్ కారు పార్కింగ్ వ్యవస్థకు అనుమతి ఇచ్చామన్నారు.జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ అమోదం తెలిపిన 6 నెలల స్వల్ప కాలంలోనే నవ నిర్మాణ్ అసోసియేట్స్ అధునాతన మల్టీలెవెల్ పార్కింగ్ వ్యవస్థను అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ లోని పర్యాటక ప్రదేశాలు, షాపింగ్ కాంప్లెక్స్ లు తదితర రద్దీ గల ప్రదేశాలలో ఇలాంటివి మరిన్ని ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ కార్ పార్కింగ్ లు పిపిపి మోడల్ లో నిర్మిస్తామని చెప్పారు. తక్కువ స్థలంలో ఎక్కువ కారులు నిలిపేలా నిర్మించే మల్టీ లెవెల్ స్మార్ట్ కార్ పార్కింగ్ తో నగరంలో వాహనదారులకు , పాదచారులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పార్కింగ్ కష్టాలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ..నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు, పార్కింగ్ కష్టాలు దూరం చేసేందుకు సీఎం ఆలోచనల మేరకు జీహెచ్ఎంసీ సౌజన్యంతో నిర్మించిన ఆటోమేటెడ్ స్మార్ట్ కార్ పార్కింగ్ లు మరిన్ని రావల్సి ఉందన్నారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ సౌజన్యంతో నిర్మించిన ఆటోమేటెడ్ స్మార్ట్ కార్ పార్కింగ్ లతో వాహనదారుల పార్కింగ్ కష్టాలు తీరతాయని చెప్పారు.

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో దీక్షా దివస్

కూకట్ పల్లి, ప్రతిపక్షం, నవంబర్ 29: తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో 2009 నవంబర్ 29న ప్రారంభించిన ఆమరణ దీక్ష, ఉద్యమ గతిని మలుపు తిప్పింది. సరికొత్త చరిత్రకు నాంది పలికింది. తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసింది.'రానే రాదు, కానే కాదు' అన్న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును సబ్బండ వర్గాలను ఏకం చేసి సుసాధ్యం చేసి చూపిన ఘన చరిత కేసీఆర్ ది, నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష సాధనకు అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర కేసీఆర్ ది, పదవులే కాదు, తెలంగాణ కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడ్డ ధీరత్వం కేసీఆర్ ది, తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం కేసీఆర్. నాలుగు కోట్ల ప్రజల్లో మార్మోగే 'జై తెలంగాణ' అనే రణ నినాదం కేసీఆర్.నవంబర్ 29న కేసీఆర్ దీక్ష లేకుండా డిసెంబర్ 9 ప్రకటన లేదు. డిసెంబర్ 9 ప్రకటన లేకుండా తెలంగాణ రాష్ట్రం లేదు. దశాబ్దాల పోరాటంతోనే తెలంగాణ సిద్ధించింది తప్ప పాలకుల దయాదాక్షిణ్యాలతో కాదన్నది అక్షర సత్యం.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన కెసిఆర్ గారి దీక్షా కాలం ఉద్యమ జ్ఞాపకాలు నా గుండెలో పదిలంగా ఉన్నాయి. దీక్షా దివాస్ సందర్భంగా శివానంద హాస్పిటల్ లో పండ్ల పంపిణీ చేయడం జరిగింది మరియు రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ గారి ఆదేశాల మేరకు కూకట్పల్లిలో ఉన్న జోహార్ లాల్ నెహ్రూ టెక్నోలజికల్ యూనివర్సిటీ జేఎన్టీయూహెచ్ విశ్వవిద్యాలయంలో దీక్ష దివాస్ కార్యక్రమం చేపట్టడం జరిగింది దీనికి టి ఎస్ టి ఎస్ మాజీ చైర్మన్ పార్టీ మీద జగన్మోహన్ రావు గారు దీక్షకు సంఘీభావం తెలపడం జరిగింది మరియు ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య నాయకులు కళ్యాణ్ అక్షయ్ చైతన్య యాదవ్ మహేష్ సంతోష్ యాదవ్ దుర్గా అజయ్ శ్రవణ్ రమేష్ సూర్య తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర సాధనలో కేసీఆర్ పోరాటం చరిత్రాత్మకం

- మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పోరాటం చరిత్రాత్మకం అని మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కృష్ణారావు అన్నారు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక దీక్షను స్మరించుకుంటూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, వివేకానంద,రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంభిపూర్ రాజు, నవీన్ రావు, బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పోరాటం చరిత్రాత్మకం. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరలా గుర్తు చేసే సమయం ఇది. 'తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో' అన్న నిబద్ధతతో నలభై కోట్ల మందిని ఏకం చేసి, కుల మతాలకు అతీతంగా దేశ వ్యాప్తంగా అన్ని వర్గాలను ఒప్పించి తెలంగాణ సాధించిన రోజు ఇదే దీక్షా దివస్" అని పేర్కొన్నారు. "అరవై సంవత్సరాల వేదనను తీర్చిన నాయకుడు కేసీఆర్. గాలి, నీరు, నేల ఉన్నంత వరకు తెలంగాణలో కేసీఆర్ అనే మూడు అక్షరాలు పదిలమే" అని అన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, "తెలంగాణ కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్యాగాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు. తెలంగాణ సాధన తర్వాత గత పదిహేను ఏళ్లలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలిపిన పలు సంక్షేమ పథకాలు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు బంధు, రైతు బీమా దేశానికే ఆదర్శంగా మారాయి" అని అన్నారు. కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

70 ఏండ్లయినా పవన్ కళ్యాణ్ సీఎం కాలేరు

- 'తెలంగాణ ఆస్తులు అమ్మి విజయవాడకు వెళ్లిపో'
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

ప్రతిపక్షం, రంగారెడ్డి, నవంబర్ 29: జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. "పవన్ కళ్యాణ్ నువ్వు 70 ఏళ్లు అయినా సీఎం కాలేవు. తెలంగాణలో ఉన్న ఆస్తులు అమ్మేసి విజయవాడకు వెళ్లిపో" అని అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ కొనసీమ జిల్లాలోని కొబ్బరి చెట్లు మొండెం లేకుండా అయ్యాయని చెప్పిన విషయాన్ని తప్పుడు గా పేర్కొన్నారని అనిరుధ్ పేర్కొన్నారు. అలాగే, "నేను కూడా పవన్ కళ్యాణ్ అభిమానినే, కానీ తప్పు మాట్లాడాడు కాబట్టి క్షమాపణలు చెప్పాలి" అని అన్నారు. ఆయన పవన్ కళ్యాణ్ సినిమాలపై అభిమానాన్ని వెల్లడిస్తూ, OG మూవీ ఫ్లాప్ అయినా రూ.800 టికెట్ రేటు ఉన్నా చూడడం జరిగినట్లు తెలిపారు.

జర్నలిస్టుల హక్కుల కోసం పోరుబాట

- డిసెంబర్ 3న జర్నలిస్టుల మహాధర్నా

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, నవంబర్ 29: తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమం తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో, తమ హక్కుల సాధన కోసం పోరుబాటే ఏకైక మార్గమైపోయిందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సమాచార శాఖ కార్యాలయం వద్ద జరగనున్న మహాధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అమలైన జర్నలిస్టుల సంక్షేమ పథకాలు తెలంగాణలో పూర్తిగా గల్లంతయ్యాయని, ప్రభుత్వాల నిర్లక్ష్యం మరింత పెరిగిందని మండిపడ్డారు. జర్నలిస్టుల కోసం అత్యవసరమైన ఆరోగ్య భద్రత, అక్రిడిటేషన్, సంక్షేమ నిధి, రక్షణ కమిటీలు నిలిచిపోయి సంవత్సరాలు గడిచినా, ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. ముఖ్యంగా చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న అప్డేడేషన్ సమస్యలు, 16 నెలలుగా ప్రకటన బిల్లుల విడుదలలో జాప్యం పై ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపు కూడా ఇంతవరకు అమలుకాలేదని, దీనివల్ల వేలాది మంది జర్నలిస్టులు నిరాశలో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 3న మాసాబ్ట్యాంక్‌లోని సమాచార శాఖ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టులు భారీ ఎత్తున ధర్నాలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను వినిపించాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హితవు పలికారు. టీయూడబ్ల్యూజే అధ్యక్షులు విరహత్ అలీ పిలుపు మేరకు, అనుబంధ సంఘమైన చిన్న మధ్యతరగతి పత్రికల సంఘం కూడా ఈ మహాధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. చిన్న పత్రికల సమస్యల పరిష్కారానికి ఈ మహాధర్నానే పెద్ద వేదిక కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజెయూ సభ్యులు మాతంగి దాస్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర కోశాధికారి అజాం ఖాన్, రాష్ట్ర నాయకులు ఇక్బాల్, ఉస్మాన్ రషీద్, బాలకృష్ణ, అహ్మద్ అలీ, మురళి, వెంకటయ్య, అఫ్రోజ్, అమాన్, మొసిన్ అలీ, గౌస్, రియాసత్, ఇలియాజ్, అంజాద్, అన్వార్, శ్రీనివాస్, జాన్ షహీద్, ఖాసీం, ప్రకాష్, అసద్ తో పాటు ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు పత్రికల సంపాదకులు పాల్గొన్నారు.

శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో దీక్షా దివస్

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, నవంబర్ 29 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి గండి మైసమ్మ లోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన దీక్షా దివాస్ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తో పాటుగా ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ లు పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధకులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడుగడుగున అవమానాలు, వివక్షతకు గురైన ఈ ప్రాంతం ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారా ఆవిర్భవించిన తెలంగాణను పదేళ్ల కాలంలో దేశంలోనే అగ్రపథాన నిలిపిన దార్శనికులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని అన్నారు. నాడు తెలంగాణ రాష్ట్రం కోసం తమ పదవులను సైతం తృణప్రాయంగా వదిలేసిన గొప్ప నాయకులు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన తీరును, ఉద్యమ పంథాను నేటి యువతకు తెలియజేయాలన్నారు. రానున్న తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో కేసీఆర్ ని మరోమారు సీఎం చేసే వరకు ప్రతీ నాయకుడు, కార్యకర్త ఒక దీక్షతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'దీక్షా దివాస్ ' చారిత్రక మలుపు

- శంషాబాద్‌లో ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్

ప్రతిపక్షం, రంగారెడ్డి, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకమైన రోజుగా నిలిచిన 'దీక్షా దివాస్ ను శంషాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకంతో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను ఈ సందర్భంగా నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ సాధనకు మలుపుతిప్పిన కేసీఆర్ చారిత్రక దీక్ష ప్రజల 60 ఏళ్ల స్వరాష్ట్ర ఆవశ్యకతను నెరవేర్చింది. తెలంగాణ కోసం సమర శంఖం పూరించిన నేతగా కేసీఆర్ పేరు సువర్ణాక్షరాలతో నిలిచిపోతుంది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, భువనగిరి నియోజకవర్గం నుండి పోటీ చేసిన క్యామ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రతిపక్షం ప్రతినిధి మేడ్చల్, నవంబర్ 29: రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మేడ్చల్ ఔటర్ రింగ్ రోడ్డుపై మునీరాబాద్ వద్ద రాంరాజు (45) హెచ్ పి గ్యాస్ ట్యాంకర్ లోడుతో వెళ్తున్నాడు. ముందున్న కారు సడెన్ గా బ్రేక్ వేయడంతో ముందు వెళ్తున్న టాటా పంచ్ కారును గ్యాస్ ట్యాంకర్ ఢీకొట్టింది. కారును ఢీకొట్టిన అనంతరం గ్యాస్ ట్యాంకర్ అదుపుతప్పి చెట్లలోకి వెళ్ళింది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ రాంరాజు అక్కడికక్కడే మరణించగా, కారులో ఉన్నవారికి గాయ్యాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రాలను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

కేసీఆర్ దీక్షతో తెలంగాణ సాధన

ప్రతిపక్షం ప్రతినిధి,మేడ్చల్, నవంబర్ 29: దీక్ష దివస్ సందర్భంగా మేడ్చల్ లో బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం దీక్ష దివస్ ను ఘనంగా నిర్వహించి ఆయన చిత్ర పాఠానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్బంగా భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కేసిఆర్ నవంబర్ చేపట్టిన దీక్ష ఫలితంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో కేసిఆర్ పాత్రను భాస్కర్ యాదవ్ కొనియాడారు. రాష్ట్ర సాధన అనంతరం తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు విష్ణుచారి, నర్సింగ్ గౌడ్, నాగరాజు, నాగార్జున్ రెడ్డితో పాటు మహిళా నాయకురాలు పాల్గొన్నారు

ప్రజల్లో ధైర్యం నింపేందుకు ఫ్లాగ్ మార్చ్

- సీఐ పవన్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 29 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు కవత్తు నిర్వహించారు. మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బాకారం, నాగిరెడ్డిగూడ గ్రామాల్లో పోలీస్ అధికారులు గ్రామంలో తిరుగుతూ ప్రజలకు ఆత్మీయ విశ్వాసం పెంపొందిస్తూ... వారిలో ధైర్యాన్ని నింపే విధంగా ఫ్లాగ్ మార్చ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దానికి పోలీసు సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా కల్పిస్తామన్నారు . ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతులను డబ్బులు అడిగితే తీవ్ర పరిణామాలుంటాయి. సీఆర్డీఏ అధికారులు, సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై విచారించి కఠిన చర్యలు తీసుకుంటాం. రైతుల సమస్యల పరిష్కారం కోసం త్రిసభ్య కమిటీ పనిచేస్తుంది. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేస్తాం.
- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

భద్రాచలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

- స్వతంత్ర అభ్యర్థి పూనెం ప్రదీప్ కుమార్



భద్రాచలం, ప్రతిపక్షం, నవంబర్ 29: భద్రాచలం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న పూనెం ప్రదీప్ కుమార్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం నిజమైన అభివృద్ధి కోసం ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. తన విజయం వ్యక్తిగత గెలుపు కాదని, పట్టణ అభివృద్ధికి ప్రజల ఆశయాలకు ప్రతీకగా భావిస్తున్నానని తెలిపారు. భద్రాచలంలో ప్రధానంగా పరిష్కారం కావాల్సిన సమస్యలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతానని చెప్పారు. పట్టణంలోని అన్ని కాలనీలలో మౌలిక సౌకర్యాల కల్పన, శుభ్రత, కాలువల విస్తరణ, రహదారుల మరమ్మతులు, ముంపు నివారణ చర్యలు వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటానని ప్రకటించారు. పార్టీలకు అతీతంగా, ప్రజలే తన బలం అని, వారి నమ్మకమే విజయం దిశగా నడిపిస్తుందని పూనెం ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. ఎవరి ఒత్తిడులూ, ఎలాంటి రాజకీయ స్వార్థాలూ లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా భద్రాచల ప్రజలకు నిస్వార్థ సేవ అందించడమే తన లక్ష్యమని చెప్పారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో రేపాక రామారావు గుప్తా, గుమ్మలూరి శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

చేనేత సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

- ఐక్య వేదిక డిమాండ్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 29: సిద్దిపేట మార్కండేయ దేవాలయంలో శనివారం జరిగిన చేనేత ఐక్యవేదిక జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, చేనేత కార్మికులపై అమలు చేస్తున్న జియో ట్యాగ్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షులు ముదిగొండ శ్రీనివాస్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కాముని రాజేశం నేత కార్మికులకు క్యాష్ క్రెడిట్, జాకార్డ్ మొగ్గాలకు సబ్సిడీ, ప్రతి నేతకు ₹ 1 లక్ష బ్యాంకు రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత వస్త్రాలను టెస్కో ద్వారా కొనుగోలు చేసి షోరూములు విస్తరించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక సభ్యులు, సంగీత యువజన సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఘనంగా దీక్షా దివస్

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 29: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్లో 16వ దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ముందుగా దీక్షా దివస్ వేదికపై ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూల మాలలు వేసి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దీక్షా దివస్ ఫొటో ప్రదర్శనను తిలకించారు.

ఇస్రో చైర్మెన్ చేతుల మీదుగా పీహెచ్డీ పట్టా

- అందుకున్న దుండిగల్‌వాసి గీతా యాదవ్

ప్రతిపక్షం, దుండిగల్, నవంబర్ 29: వెల్ టెక్ యునివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనలో భాగంగా పరిశోధకురాలు మేడ్చల్ జిల్లా దుండిగల్ కు చెందిన మాజీ ఏఎంసీ చైర్మెన్ రవీందర్ యాదవ్ కూమార్తె గీతా యాదవ్ తన డాక్టర్ పరిశోధన పూర్తి చేసి పీహెచ్డీ డిగ్రీని ఇస్రో చైర్మెన్ నారాయణన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నారాయణన్ మాట్లాడుతూ గీతా యాదవ్ పరిశోధన శీర్షిక మెరుగైన భద్రతతో, ఎక్కువ సామర్థ్యంతో క్లౌడ్ స్టోరేజ్లో చిత్రాలను గుర్తించి పోలిక ఆధారంగా అభివృద్ధి చేసిన ఈ విధానం భవిష్యత్తులో క్లౌడ్ డేటా మేనేజ్మెంట్, సెక్యూరిటీ రంగాల్లో కీలకమైన పాత్ర పోషించునుందని తెలిపారు. పీహెచ్డీ పట్టాను పొందిన గీతా యాదవ్ వెల్ టెక్ యూనివర్సిటీ అభినందించి, పరిశోధన నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ ఆమె భవిష్యత్ కార్యాచరణలకు శుభాకాంక్షలు తెలిపింది.

కపిల్ కుటీర్ ఆధ్వర్యంలో పిల్లల దత్తతపై అవగాహన

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 29: కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్ లో గల సంక్షేమ ట్రస్ట్ కపిల్ కుటీర్ శిశు సంరక్షణ కేంద్రంలో "దత్తత మాసం" సందర్భంగా పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు, దత్తతకు దరఖాస్తు చేసుకున్న వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి మార్త సరస్వతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో న్యాయపర పైన దత్తత, రక్తసంబంధీకులనుండి మాత్రమే పిల్లలను దత్తత తీసుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ శ్రీరామోజు ధనలక్ష్మి ,డిసిపిఓ పర్వీన్ , సంరక్షణ కేంద్రం ఉపాధ్యక్షుడు వకులా వకులా రాజారెడ్డి. డి సి పి యు , చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది శిశుగృహ మేనేజర్ తేజస్వి, పూదరి శాంత,జోగు తిరుపతి,రాజు చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ , మాదుగుల రమేష్, మాదాసు కవితా దేవి, మునిగంటి మునిగంటి రాజకుమార్ రాజకుమార్ సాదినేని రమేష్,నాయిని స్వప్న సుందరగిరి సాయి కిరణ్ గౌడ్, కడే మహేష్, ఎడ్ల ప్రియాంక సంరక్షణ సిబ్బంది శ్రీనివాస్ , కృష్ణవేణి, బాల సదన్ సూపరిండెంట్ సంతోషిని ,శ్రీలత, లక్ష్మి సరస్వతి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర మరిచిపోని రోజు దీక్షా దీవస్

- కేసీఆర్ పోరాటంతోనే రాష్ట్ర ఏర్పాటు కల సాకారం
- పదేండ్లలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపాం
- స్థానిక ఎన్నికల్లో ప్రజల తగిన గుణపాఠం తప్పదు
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 29: రాష్ట్ర సాధన ఉద్యమంలో నాడు కేసీఆర్ చేపట్టిన దీక్ష దీవాస్ దేశ చరిత్ర లోనే మరిచిపోని రోజుగా మిగిలిపోయిందని మాజీ మంత్రి. సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శనివారం దీక్షాదివస్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో దీక్ష దీవాస్ కార్యక్రమాన్ని నిర్వహించా రు.బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.స్వా తంత్ర్యం కోసం 200 ఏండ్లు ఉద్యమం జరిగిందని, ఇందులో 27 ఏండ్లు మహాత్మాగాంధీ పోరాటం చేశారని గుర్తు చేశారు.అదే కోణంలో అరవైఏండ్ల తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ 14 ఏండ్ల పోరాటంతో రాష్ట్ర ఏర్పాటు కల సాకారమైందని చెప్పారు. దశాబ్దాల తరబడి ఉద్యమం చేసి సాధించుకున్న రాష్ట్రంలో తెలంగాణ వ్యతిరేకులకు స్థానం లేకుండా చేయాలన్నారు.దేశంలో నాడు పంటల సాగులో అగ్రగామిగా ఉన్న పంజాబ్, హర్యాన లాం టి రాష్ట్రాలకు మించి తెలంగాణలో కేసీఆర్ ముందు చూపుతో మొదటి స్థానంలో నిలిపారన్నారు. ఏనాడూ ప్రజలకు కేసీఆర్ ఒట్టి మాటలు చెప్పలేదని, అమలు కాని హామీలు ఇవ్వలేదని ప్రజలందరి మేలు కోసం పరితపించి పనిచేశారన్నారు. కేసీఆర్ చేపట్టిన ఉద్యమంలో విద్యార్థులంతా రోడ్లపైకి వచ్చి ఉద్యమాన్ని ఉధృతం చేశారన్నారు.రాష్ట్ర ఏర్పాటు కోసం రాజీనామాలు చేయమంటే కాంగ్రెస్, టీడీపీ నాయకులు పారిపోయారని మండిపడ్డారు.జస్టిస్ శ్రీ కృష్ణ కమిటీ నుంచి నేను మాట్లాడిన తర్వాత కాంగ్రెస్ నుంచి చిన్నారెడ్డి, మల్లు రవికి అవకాశం ఇచ్చిన కొత్తగా మాట్లాడమనే సరికి కూర్చున్నారని అన్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక గారడీ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని..కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలు ఎప్పటికి మర్చిపోరని అన్నారు.జూబ్లీహిల్స్ లో గెలిచిన తర్వాత కాంగ్రెస్ నాయకులు భ్రమలో ఉన్నారని.. కానీ స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని విమర్శించారు.

లక్ష తప్పుడు పోస్టులు పెట్టినా బెదరను

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే సోషల్ మీడియాలో వ్యక్తి గత దూషణలు పెట్టిస్తున్నారని,అలాంటి లక్షలు పోస్టులు సోషల్ మీడియాలో పెట్టిన భయపడే ప్రసక్తేలేదని మాజి మంత్రి. నిరంజన్ రెడ్డి అన్నారు.నెహ్రూ,ఇందిరా గాంధీ పాలన పరంగా గౌరవిస్తామని... విధానపరంగా 7వేల మంది తెలంగాణ పిల్లల మరణానికి కారణమైన కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తామని అన్నారు. ఏడాదిలో 2లక్షల ఉద్యోగాల ఇస్తామన్నా మాటేమిటని?.. కాంగ్రెస్ పాలనలో 700మంది రైతులు ఆత్మహత్యలు, 60మంది చిన్నారులు హాస్టళ్లలో అనారోగ్యంతో మృతి చెందారని..పనికిమాలిన హామీలు ఎందుకు ఇచ్చారని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకత మూ టగట్టుకున్నదని, ఇంతలా దిగజారిన పార్టీని దేశంలో ఎక్కడా చూడలేదన్నారు.ఎటు చూసినా.. ఏ వర్గం వారిని కదిలించినా ప్రజాగ్రహం పెల్లుబికుతున్నదన్నారు. నిత్యం అప్పులు చేశారని చెబుతున్న కాంగ్రెస్, నెరవేర్చలేని హామీలు ఎందుకు ఇచ్చారని మండిపడ్డారు.నిత్యం అబద్ధాలతో పాలన సాగిస్తున్నారని, గాలి మాటలతో గారడీ చేస్తూ తప్పుదోవపట్టిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇక ఎన్ని చెప్పినా నమ్మే స్థితిలో లేరన్నారు. ముందుగా కేసీఆర్ చిత్రపటానికి నిరంజన్ రెడ్డి పాలాభిషేకం చేశారు.కార్యక్రమంలో నా యకులు రమేశ్‌గౌడ్, వాకిటి శ్రీధర్, కురుమూర్తియాదవ్, లక్ష్మారెడి,డ కృష్ణానాయక్, అశోక్, జాత్రునాయక్, గులాం ఖాదర్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై పరిశీలకుల సమీక్ష

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 29 : జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల పారదర్శక నిర్వహణకు ఆయా నోడల్ అధికారులు తమ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు కార్తీక్ రెడ్డి, రాకేష్ లు అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో శనివారం నాడు గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణపై జిల్లా నోడల్ అధికారులతో సాధారణ పరిశీలకులు కార్తీక్ రెడ్డి,మరియు వ్యయ పరిశీలకులు రాకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన వివిధ ఏర్పాట్లను పరిశీలకులకు వివరించారు. మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటితో ముగిసిందని, రేపటి నుండి రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుందని తెలిపారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ మేరకు జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నందున, అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించిన పరిశీలకులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 29 : గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా పంచాయితీ ఎన్నికల సాధారణ పరిశీలకులు కార్తీక్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు కార్తీక్ రెడ్డి, జడ్పీ సి ఈ ఓ జానకి రెడ్డి, హౌసింగ్ పీడీ చలపతిరావుతో కలిసి కాశీపూర్,కంది రైతు వేదికలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను, నామినేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రంచాయతీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో కావలసిన ధృవ పత్రాలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు తెలియజేయాలని ఆయన సూచించారు. ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించి వచ్చిన నామినేషన్ల దరఖాస్తు వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీ ఓ. పాల్గొన్నారు.

విజయానికి వైకల్యం అడ్డు కాదు..

- సవ్యాంగులకు దీటుగా దివ్యాంగుల ప్రతిభ
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 29 : దివ్యాంగులు సవ్యాంగులకు దీటుగా అన్ని రంగాలలో తమ ప్రతిభను చాటుతున్నారని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో మహిళా, శిశు, వికలాంగుల, మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య క్రీడా పోటీలను ప్రారంభించి పాల్గొన్న వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,దివ్యాంగులు సవ్యాంగులకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని రంగాలలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్నారని అన్నారు. వికలాంగత విజయానికి అడ్డు కాదని, పట్టుదల ఆత్మవిశ్వాసంతో అనుకున్నది సాధించాలని ఉద్బోధించారు. ప్రభుత్వం అందరి కోసం సమాన అవకాశాలు, సదుపాయాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. క్రీడలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు వారిలోని ప్రతిభను వెలుగులోకి తెస్తాయని అన్నారు. కార్యక్రమంలో వివిధ క్రీడా విభాగాల్లో జిల్లా వ్యాప్తంగా వచ్చిన దివ్యాంగులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వీరికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రన్నింగ్, షాట్‌పుట్, వీల్‌చెయిర్ రేస్, ఇండోర్ గేమ్స్ తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. ఆయా పోటీలను కలెక్టర్ ప్రత్యేకంగా దగ్గరుండి పరిశీలించడంతోపాటు క్రీడాకారులను ప్రోత్సహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ లలిత కుమారి, యువజన సంక్షేమ శాఖ అధికారి ఖాసిం బే గ్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం. వసంత్ రావు,అధికారులు, కోచ్‌లు, వాలంటీర్లు,దివ్యాంగులు,జిల్లా దివ్యాంగుల అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఆధునిక వైద్య సేవలు

- మెడినోవాలో స్ట్రోక్ యూనిట్.. క్యాత్ ల్యాబ్ చికిత్సలు
- మెడినోవా ఆసుపత్రి మేనేజర్ పార్థ సారథి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 29: ప్రజలకు ఆధునిక వైద్య సేవలను అందుబాటైన ధరలలో అందించడానికి మెడిసిటి హాస్పిటల్స్ గ్రూపు సంస్థ అయిన మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సిద్ధమయిందని మెడినోవా ఆసుపత్రి మేనేజర్ పార్థ సారథి ఒ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ లో మొట్ట మొదటి స్ట్రోక్ యూనిట్, క్యాత్ ల్యాబ్ తో పాటూ పలు ఆధునిక వైద్య సదుపాయాలను మేడ్చల్లోని మెడిసిటీ హాస్పిటల్స్ గ్రూపు సంస్థ అయిన మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అందుబాటులోనికి తెచ్చిన విషయం తెలిసిందేనని అన్నారు. ఒకవైపు అత్యాధునిక వైద్య సదుపాయాలను కలుగజేస్తూనే మేడ్చల్ పట్టణ ప్రజలకు అందుబాటు ధరలలో చికిత్స అందించడానికి ప్రత్యేక చికిత్సా ప్యాకేజీలను అందుబాటులోని తెచ్చిందన్నారు. ఈ ప్యాకేజీలలో భాగంగా గర్భిణి మహిళలకు అత్యంత అందుబాటైన ధరలలో ప్రసవ సమయాలలో అత్యంత నాణ్యమైన, ఆధునిక వైద్యాన్ని అందించడానికి ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించామన్నారు. ఈ ప్యాకేజీలో భాగంగా సాధారణ ప్రసవమైనా, సిజేరియన్ ద్వారా ప్రసవమైనా హాస్పిటల్ ఖర్చు తో పాటూ మందు, ఇతరత్రా చికిత్సలు, సదుపాయాలు, చిన్నారికి అవసరమైన చికిత్స అన్నీ కలుపుకొని రు. 49,999 కే అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలానే హిప్ రీప్లేస్మెంట్ చేసుకొనే వారికి అన్ని ఖర్చులు కలుపుకొని రు. 1,50,000 వేల ప్యాకేజీ, పూర్తి మోకాలు జాయింట్ మార్పిడి అవసరమైన వారికి అన్ని ఖర్చులు కలుపుకొని రు. 1,20,000 వేల ప్యాకేజి క్రింద చేయనున్నారు. ఈ సదుపాయాన్ని మేడ్చల్ పట్టణవాసులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



“

వివాదాల్లో చిక్కుకోవడం భారతదేశ స్వభావం కాదు. మనకు ఎవరితోనూ వాదనలులేవు. మనం వివాదాలకు దూరంగా ఉంటాం. కలిసి ఉండటం, సోదరభావాన్ని పెంపొందించడం మన సంప్రదాయం. బ్రిటిషర్లు రాకముందు మనం ఐక్యంగా లేమని 'హింద్ స్వరాజ్'లో గాంధీ రాశారు. కానీ అది బ్రిటిషర్లు మనకు నేర్పిన తప్పుడు కథనం.

- నాగ్‌పూర్ బుక్ ఫెస్టివల్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

ప్రాంతీయం

కేసీఆర్ త్యాగాలు చరిత్రాత్మకం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు
- సిద్దిపేటలో బీఆర్ఎస్ దీక్ష దివస్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 29: కేసీఆర్ ఆమరణ దీక్ష తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి కీలక మలుపు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో దీక్ష దివస్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హరీష్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, నాయకులు వంటేరు ప్రతాప్ రెడ్డి , రాధాక్రిష్ణ, కడవేర్గు రాజనర్సు, కే. సంపత్ రెడ్డి, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, గుండు శీను, నందా దేవి, బూర విజయతదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన తెలంగాణ ఉద్యమకారుడు, కవి అందెశ్రీకు నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడిన హరీష్ రావు నవంబర్ 29 తెలంగాణ చరిత్రలో ఓ మలుపుతిప్పిన రోజు అని పేర్కొన్నారు. ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని, ఇక్కడ జరిగిన ఉద్యోగుల గర్జనే ఉద్యమానికి బలం చేకూర్చిందని గుర్తుచేశారు. 'తెలంగాణ వచ్చేదాకా నా ప్రాణం పోదు... నేనేమైనా చస్తే నా శవం మీద తెలంగాణ జెండా వేయాలి' అని కేసీఆర్ చెప్పిన మాటలను స్మరించుకున్నారు. కాంగ్రెస్ నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన ఆయన, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మూర్ఖంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తన ఆత్మకథ పుస్తకంలో కేసీఆర్ కోసం ప్రత్యేకంగా ఒక పేజీ వ్రాసిన విషయాన్ని గుర్తుచేసారు. డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన కూడా కేసీఆర్ దీక్ష ఫలితమేనని అన్నారు. తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్ రెడ్డికి కోదండ రామ్ దగ్గర అవుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ట్రిబ్యునల్ ముందు మూడు రోజులుగా తెలంగాణను కించపరిచేలా వాదిస్తున్నప్పటికీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి నోరు కూడా తెరవడం లేదని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్లోబల్ సమ్మిట్ పేరిట భూములు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నది రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంతకాలం కేసీఆర్ చరిత్ర నిలిచి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఉద్యమ గడ్డపై మరోసారి ఉద్యమోత్సాహం

మాజీ మాజీ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో గులాబీ శ్రేణులు పాల్గొని ఉద్యమ స్ఫూర్తిని మరోసారి నెమరువేసుకున్నారు. ఉదయం సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన భారీ బైక్ ర్యాలీ పట్టణ ప్రధాన రహదారుల గుండా ఉత్సాహంగా సాగింది. అంబేద్కర్ విగ్రహానికి హరీష్ రావు పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కోటిలింగాల దేవాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి, ఆచార్య జయశంకర్ విగ్రహానికి నివాళ్లు అర్పించారు. పాత బస్టాండ్ వద్ద పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. బీజేఆర్ చౌరస్తా వద్ద బీజేఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పించిన అనంతరం రంగదాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. తరువాత 1531 రోజుల పాటు సాగిన చారిత్రాత్మక దీక్షా శిబిరం స్మృతిచిహ్నాన్ని క్యాంప్ కార్యాలయంలో పునఃప్రారంభించారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమం కోసం ప్రాణాలు అర్పించిన అవునూరు సత్తయ్య, శ్రీకాంత్, కన్నబోయిన ఐలయ్యల త్యాగాలను దీక్షా దివస్ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్మరించారు. వీరి కుటుంబాలను సన్మానిస్తూ, ఉద్యమ వీరుల పోరాటాన్ని కీర్తించారు.

పద్మశాలి యువజన సంఘం నూతన కార్యవర్గం

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 29: మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలి యువజన సంఘం ఎన్నికలు శనివారం స్థానిక పద్మశాలి సంఘం ఆవరణంలో సంఘం అధ్యక్షులు దేవదాస్ నిర్వహించారు. అధ్యక్షుడిగా తలకొక్కుల ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా షేర్ల నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా హనుమండ్ల నాగరాజు నేత, కోశాధికారిగా గుండు మల్లేశం, సహాయ కార్యదర్శిగా రాచకొండ సాయి మహేష్ లను ఏకగ్రీవంగా తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి ఎల్లం రాజు, కోశాధికారి దేవసాని హనుమందాస్, సహాయ కార్యదర్శి పాసి కంటి శ్రీనివాస్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు దేవులపల్లి రాజారామ్, దొంతుల ప్రభాకర్, స్వర్గం రాజేశం, శ్రీనివాస్, బత్తిని నరేష్, పెండెం వెంకటేశం, పెండెం కృష్ణ ,ఎడెల్లి విష్ణు, సిలివేరి వెంకటేష్, దొంతుల ఆనంద్, బొడ్డు రమేష్, నల్ల శివకుమార్ లు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్ష,అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ

- మెదక్ లో ఘనంగా దీక్ష దివస్
- మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 29:- కేసీఆర్ దీక్ష, అమరవీరుల త్యాగఫలితమే నేటి తెలంగాణ అని భారత రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దీక్ష దివస్ కార్యక్రమం ఘనంగా ఘనంగా నిర్వహించా. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా నాయకులతో కలసి జిల్లా పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరుల స్థూపానికి నివాళులు అర్పించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఉద్యమం నాటి ఫొటో ఎగ్జిబిషన్లు ప్రారంభించి, తిలకించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా గొంతుక అందెశ్రీ

- టీపీటీఎఫ్ సిద్దిపేట జోన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 29: తెలంగాణ ప్రజాకవి అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి తీవ్ర నష్టమని, తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజా గొంతుకై ప్రజల పక్షాన నిలబడి, కొట్లాడి తెలంగాణ సాధనకు కృషిచేసిన వ్యక్తిని మనం మరవకూడదని ప్రముఖ కవి డాక్టర్ తైదల అంజయ్య అన్నారు. టీపీటీఎఫ్ సిద్దిపేట జోన్ ఆధ్వర్యంలో జోన్ కన్వీనర్ ఏ. సత్యనారాయణ అధ్యక్షతన అందెశ్రీ, కె నారాయణ స్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన తైదల అంజయ్య, ప్రముఖ కవి డాక్టర్ పొన్నల బాలయ్య మాట్లాడుతూ... తెలంగాణ సామాజిక ఉద్యమాలలో తెలంగాణ రాష్ట్ర గీతం వ్రాయడంలో అందెశ్రీ ఎంతో చొరవ చూపారని, తెలంగాణ సమాజం వారిని ఎల్లప్పుడు గుర్తుపెట్టుకోవాలని జీవిత కాలం మొత్తం తెలంగాణ సమాజం పట్ల , మానవ విలువల కోసం ప్రజల కోసం ఎలుగెత్తి చాటి, గొంతెత్తి పాడాడని ,వారికి సందర్భంగా ఘన నివాళులర్పిస్తున్నామన్నారు. కే నారాయణ మృతి ఉపాధ్యాయ లోకానికి తీవ్ర లోటని టీపీటీఎఫ్ రాష్ట్ర సొసైటీ అధ్యక్షులు జి తిరుపతిరెడ్డి అన్నారు. సిరిసిల్ల జిల్లాలో సామాన్య కుటుంబంలో పుట్టి ఆదిలాబాద్ జిల్లాలో ఎస్జీటీ ఉపాధ్యాయులుగా నియమింపబడి ఏపీటీఎఫ్ 1983 లో తెలంగాణకు విస్తరించే క్రమంలో విశేష కృషి చేశారని అన్నారు. సమాజంలో మౌలిక మార్పులు ,విద్యారంగా అభివృద్ధి ,కామన్ స్కూల్ విధానం కోసం నిరంతరం తపన పడ్డ వ్యక్తి నారాయణ అని, సార్ మరణం విద్యారంగానికి, సామాజిక ఉద్యమాలకు తీవ్ర లోటని అన్నారు. వారి మృతికి నివాళులర్పిస్తూ వారి ఆశయ సాధన కోసం టీపీటీఎఫ్ ఎల్లవేళలా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు తిరుపతి, జానకి రాములు, రాంరెడ్డి, హత్య కృష్ణ, చంద్రా రెడ్డి, గోపాల్ రెడ్డి, నరేష్, సుధాకర్ ,కనకయ్య, శ్రీనివాస్ గౌడ్, అనిల్ కుమార్, బైరా రెడ్డి శ్రీకాంత్, పోన్నమల రాములు ,ఇంద్రసేనారెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ వారీగా నామినేషన్ ప్రక్రియ పరిశీలన

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 29: సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం వర్గల్ మండలంలోని గౌరారం క్లస్టర్, గజ్వేల్ మండలం, రీమ్మనుగూడ క్లస్టర్లో నామినేషన్ల ప్రక్రియను జిల్లా గ్రామపంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు కె. హరిత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గౌరారం క్లస్టర్లో గౌరారం, సింగయిపల్లి, చౌదరిపల్లి, చాంద్ కాన్ మక్తా, అవుసులోపల్లి, గజ్వేల్ మండలంలో రీమ్మనుగూడ, బూరుగుపల్లి, కొడకండ్ల గ్రామాల నామినేషన్లు స్వీకరిస్తున్నామని సిబ్బంది తెలపగా స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అన్ని సౌకర్యాలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు చేయాలన్న 6305956344 ఫోన్ నంబర్లో సంప్రదించాలని హరిత తెలిపారు.

మోసానికి మరో రూపం కాంగ్రెస్ పార్టీ

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 29: మోసానికి మరో రూపం కాంగ్రెస్ పార్టీ అని బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరిగిందంటూ పార్టీ పిలుపు మేరకు పాత బస్టాండ్ వద్ద సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేయాలని చూడగా పోలీసులు అడ్డుకొని వన్ టౌన్ కు తరలించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ... కామారెడ్డి డిక్లేషన్ పేరిట బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ అమలు చేయలేదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు కేవలం 17 శాతం మాత్రమే ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. బీసీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. బీజేపీ నాయకులు కాసాని కొట్టు సంతోష్, గుండ్ల జనార్దన్, తొడుపునూరి వెంకటేశం, దాబా నరేష్, లక్ష్మారెడ్డి, సురేష్, భోగి శ్రీనివాస్, సంతోష్, గంధం కర్నాకర్ అరిగే యాదగిరి తాడేపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజీకి 35 కోట్లు విడుదల

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 29: శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ప్రారంభమైన ఇంజనీరింగ్ కాలేజీ ప్రథమ సంవత్సరం తరగతులు కొనసాగుతున్నాయి. హుస్నాబాద్లో ఇంజనీరింగ్ విద్యార్థులకు తాత్కాలికంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తాజాగా రూ. 35 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'తపస్' మండల అధ్యక్షుడిగా వెంకటేష్

-**ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 29:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం చేగుంట మండల అధ్యక్ష కార్యదర్శుల ఎన్నికలు సజావుగా జరిగాయి. అధ్యక్షుడిగా రావుల వెంకటేష్, కార్యదర్శిగా తంగేళ్లపల్లి కృష్ణమూర్తి ఎన్నికైనట్లు తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జజ్జి ఎల్లం, చల్లా లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు మల్లారెడ్డి, యాదగిరి, కృష్ణమూర్తి, ప్రభాకర్, నరసింహారెడ్డి, చరణ్ దాస్, శ్రీనివాస్, నరేష్, రేఖ, సుమతి, అమరేశ్వరి, సంగీత, విజయాలత, సరూపరాణి, మంజుల, రాధా, సంధ్యారాణి, సరస్వతి, ఉమాదేవి, శ్రీలత, శ్రీదేవి, వనిత, రేవతి తదితరులు పాల్గొన్నారు.



వరి కొయ్యలను కాల్చితే రైతులకు నష్టమే

- పంట వ్యర్థాలతో భూసారం
- దుబ్బాక డివిజన్ ఏడీఏ కాంపాటి మల్లయ్య

ప్రతిపక్షం, తొగుట, నవంబర్ 29: వరి కొయ్యలను కాల్చితే రైతులకు నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యవసాయ శాఖ దుబ్బాక డివిజన్ ఏడీఏ కాంపాటి మల్లయ్య ఎల్లారెడ్డిపేట గ్రామంలో రైతులకు పంట వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చితే విపరీతమైన వేడితో నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. పంటలకు అవసరమైన ఖనిజ, లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, తొండల్లాంటి అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. పొలాన్ని కలియ దున్నితే ఎన్నో లాభాలు ఉన్నాయి వరి కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10శాతం వరకు అధికంగా వచ్చే అవకాశముంది. దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్‌ఫాస్పేట్ లేదా వేస్ట్ డీకంపోజర్ చల్లితే వరి కొయ్యల అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయని అన్నారు. సూపర్ ఫాస్ఫేట్ చల్లితే భూమి చౌడుబారడం నుంచి తప్పించడమే కాకుండా భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచుతుంది. కలియ దున్నడం వల్ల ఎకరాకు టన్ను వరకు ఎరువు తయారవుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, ఏఈఓ నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

జిల్లా ప్రగతికి బ్యాంకర్లు కృషి చేయాలి

- రబి సీజన్లో రైతులకు అండగా ఉండాలి
- జిల్లా స్థాయి సమీక్ష కమిటీ మావేశంలో కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 29: సిద్దిపేట జిల్లా ప్రగతిలో ముందంజలో నిలిచేలా లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని, వ్యవసాయ రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, పంట రుణాలపై ప్రగతిని మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ హైమవతి సూచించారు. శనివారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రగతి, సబ్సిడీ, రుణాలు ఇతర అంశాలపై బ్యాంకర్లకు, అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లాలో సెప్టెంబర్ 2025 నాటికి 167 బ్యాంకుల పరిధిలో డిపాజిట్ 5835.37కోట్లు, అడ్వాన్స్ 11728.5,బిజినెస్ 17563.87 కోట్ల రూపాయల వ్యాపారం ద్వారా సిడి రేషియో 200.99 ప్రగతిని సాధించామని, అదేవిధంగా డిపాజిట్ మొబిలైజేషన్ కొరకు చర్యలు చేపట్టడం జరుగుతుందని అధికారులు వివరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... వ్యాపార రంగాలకు మాత్రమే కాకుండా విశ్వవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ రంగానికి కూడా అధిక ప్రాధాన్యతనిచ్చి రుణాలు, ప్రోత్సాహకాలను అందిస్తూ రైతులకు సహకరించాలని అన్నారు. జిల్లాలోని దాదాపు 150 మహిళా సంఘాలకు సంబంధించిన పెండింగ్ లను క్లియర్ చేయాలని, ఎన్పీఏ, పియం ఎఫ్ఎంఇ పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. హుస్నాబాద్ లో మహిళాసంఘాలకు నాబార్డ్ ద్వారా రుణాలు ఇప్పించి, ఆర్థికంగా, సాంకేతికంగా సహకరించి మహిళలను గొప్ప వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి శిక్షణను ఇవ్వాలని తెలిపారు. డిసెంబర్ లో రబి సీజన్లో రైతులకు అండగా ఉండాలని, బ్యాంకుల ప్రగతిని ఆన్ లైన్ లో నమోదు చేసేలా చూడాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో బ్యాంకులు వారి పనితీరును మెరుగు పరుచుకోవాలని, ప్రతి బ్యాంక్ వారీగా నివేదికను సిద్ధం చేసి ప్రగతిలో వెనుకబడిన బ్యాంకుల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, ఎల్డీఎం హరిబాబు, యూబీఐ ఆర్జైచ్ శ్రీనివాస్, రిజర్వ్ బ్యాంక్ ఏజీఎం ఎల్డీఓ రెహమాన్, నాబార్డ్ డీడీఎం నిఖిల్, టీజీబీ ఆర్ఎం ఉదయ్ కిరణ్, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

"



స్పిన్, సీమ్ పిచ్‌లపై ఆడాలంటే ఓపిక అవసరం. ఎక్కువసేపు క్రీజులో ఎలా నిలబడాలో తెలిసిన రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ లాంటి బ్యాటర్లు మనకు లేరు. టెస్టుల్లో బ్యాటింగ్ అంటే క్రీజులో నిలదొక్కుకోవడమే. ఇప్పుడున్న ప్లేయర్లలో ఎంత మంది డొమెస్టిక్ క్రికెట్ ఆడుతున్నారు.
- మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్

ప్రాంతీయం

చావు నోట్లో తలపెట్టి

తెలంగాణ సాధించిన కేసీఆర్

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 29: తెలంగాణ నలుదిశలను ఏకం చేసి, ప్రత్యేక రాష్ట్రం వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. అని రణగర్జన చేసిన రోజే దీక్ష దివస్ అని రామగు మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. దీక్ష దివస్ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో తెలంగాణ అమరవీరు లకు నివాళులు అర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పోరాట స్ఫూర్తి మరువలేనిదని, అన్ని వర్గాలను ఒక్కతాటిపైకి తెచ్చి సకల జనుల సమ్మెతో ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించారన్నారు. తెలంగాణ ఉద్యమకారులను ఎప్పటికీ మరువలేమని, చరిత్రలో మరచిపోలేని రోజు నంబర్ 29 అన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ దీక్షకు దిగిన రోజు చరిత్రలో మర్చిపోలేన్నారు. కేసీఆర్ అలుపెరుగని పోరాటంతోనే తెలంగాణ సిద్ధించిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో అనేక రాస్తారోకోలు, ధర్నాలు, పోరాటాలు చేసి తెలంగాణ తెచ్చుకున్నామని ఇప్పుడున్న కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణ వేణీ, గాధం విజయ, జనగామ కవిత సరోజినీ, బాదె అంజలి, చెలకలపల్లి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, నీరటీ శ్రీనివాస్, రామకృష్ణ, కిరన్ జీ, చింటూ, యాసర్ల తిమెతి, ఓదేలు ఆవునూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూలో ఘనంగా దీక్షాదివస్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 29: దీక్షాదివస్‌ను పురస్కరించుకొని, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరంలోని శాతవాహన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రాజకీయ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముందుగా తెలంగాణ ఉద్యమపు చిహ్నమైన కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆ తరువాత అక్కడికి చేరుకున్న విద్యార్థులను సమావేశమై, ఉద్యమ పుణ్యస్మృతులను మరొకసారి గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ యాత్ర వెనుక కష్టాలు, త్యాగాలు, పోరాటాలు ఎలా సాగాయో విద్యార్థులకు ఆయన వివరించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును మలచుకోవాలంటే క్రమశిక్షణ, అవగాహన, సమాజంపై బాధ్యత కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, రాష్ట్ర నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, తెలంగాణ సాధనకు మార్గదర్శకత్వం వహించిన కేసీఆర్ నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

కార్యకర్తలతో 'ఎమ్మెల్యే కమలాకర్' సమావేశం

దీక్షాదివస్‌ను సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ ఉద్యమానికి గుర్తుగా జరిగే ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా జరుపుకుంటున్న నేపథ్యంలో, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఈ సమావేశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దీక్షాదివస్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణ సాధనలో చేసిన పోరాటాన్ని గుర్తు చేస్తూ, ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ నూరిపోశారు. ఈ కార్యక్రమం మొత్తం ఉత్సాహంగా సాగింది. నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై దీక్షాదివస్ యొక్క అసలు సందేశాన్ని ప్రజలకు చేరవేయాలని నిర్ణయించారు.

హైకోర్టు న్యాయమూర్తికి

ఘన స్వాగతం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 29 : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీ దేవి శనివారం నిజామాబాద్ కు విచ్చేసిన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద హైకోర్టు న్యాయమూర్తిని, జిల్లా జడ్జి జీ.వీ.ఎన్.భరతలక్ష్మి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, కలెక్టర్, పోలీస్ కమిషనర్లతో హైకోర్టు న్యాయమూర్తి అతిథి గృహంలో కొద్దిసేపు భేటీ అయ్యారు. అంతకు ముందు హైకోర్టు జడ్జి పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.



సీఎం సభ ఏర్పట్లు పరిశీలించన మంత్రి పొన్నం

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 29: డిసెంబర్ 3న హుస్నాబాద్ పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా అక్కన్నపేట రోడ్డు వద్ద బహిరంగ సభ స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లు, వచ్చిన ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు, పార్కింగ్ సౌకర్యం తదితర అంశాలపై సూచనలు చేశారు. సభ ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి హుస్నాబాద్ నియోజకవర్గంలో డిసెంబర్ 3న పర్యటిస్తున్నారని, అందుకు సంబంధించిన బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ సభకు అందరూ తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కూడా వస్తున్నారని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు సభను విజయవంతం చేయాలని కోరారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 29: హాస్టల్ విద్యార్థులు చలికి వణుకుతున్నరని డీబీఎఫ్ చేసిన విన్నపానికి స్పందించిన ఏర్రవల్లి మాజీ సర్పంచ్ మెండి బిక్షపతి ఆధ్వర్యంలో శనివారం నర్సింములు, స్వాతి దంపతుల కుమారుడు విహన్ అధిరామ్ పుట్టిన సందర్భంగా గజ్వేల్లోని ఎస్టీ హాస్టల్లో 42 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ నాయకుడు ఏగొండ స్వామి మాట్లాడుతూ ఎస్టీ హాస్టల్ విద్యార్థులు చలికి పలుకుతున్నారని, ప్రహరీ గోడలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇన్చార్జి మంత్రికి విన్నవించడం పట్ల ప్రతికలో వచ్చిన ప్రకటనపై స్పందించి దుప్పట్లు పంపిణీ చేయటం హర్షించదగిన విషయమన్నారు.

ఊరికి ఊపిరి పోసే వారిని సర్పంచ్ గా ఎన్నుకుందాం

- తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ స్వామి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 29: త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎలక్షన్లలో గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యల సాధన పరిష్కార దిశగా " ఊరికి ఉరేసే వారు కాకుండా, "ఊరికి ఊపిరి పోసేవాడిని" ఎన్నుకోవాలని తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ నిరుదు స్వామి అన్నారు. స్థానిక సంస్థలను ఎన్నికలను పురస్కరించుకొని శనివారం స్థానిక పత్రికావిలేకరుల తో మాట్లాడుతూ చదువుకున్నవాడిని సామాజిక పరిజ్ఞానం ఉన్నవాడిని లోకజ్ఞానం అవగాహన ఉన్న యువకులను సర్పంచ్ గా ఎన్నుకోవాల న్నారు. అంతేగాని రాజకీయ పార్టీలు పెట్టిన అభ్యర్థిని ఎన్నుకోవడం గ్రామానికి మంచిది కాదన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు మైస రాములు మాదిగ, ముదిరాజ్ సంఘం నాయకులు బాకీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను

తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 29 : కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఎల్లప్పుడు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి మండల

జీపీవోల నూతన కమిటీ ఏకగ్రీవం

- గౌరవ అధ్యక్షుడిగా తహసీల్దార్ రమేష్ నియామకం

-ప్రతిపక్షం, హుస్నాబాద్(చిగురుమామిడి), నవంబర్ 29: మండలంలోని గ్రామ పాలన ఆఫీసర్ల (జీపీవో) సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. నూతన కార్యవర్గాన్ని ప్రకటించే ముందు, చిగురుమామిడి తహసీల్దార్ ముద్దసాని రమేష్‌ను సంఘం గౌరవ అధ్యక్షుడిగా, నాయబ్ తహసీల్దార్ తాడ స్వరూపారాణిని గౌరవ సలహాదారుగా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా నియమించారు. అనంతరం జీపీవో సంఘం ముఖ్య కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిలో అధ్యక్షులుగా పూరుగొండ రమేష్ రెడ్డి (చిగురుమామిడి జీపీవో), వ్యవస్థాపక అధ్యక్షులు కొలిపాక బాలయ్య (ఇందుర్తి జీపీవో), ఉపాధ్యక్షులు జీల భూమయ్య (రేకొండ జీపీవో), జనరల్ సెక్రటరీ గోదారి అనిత (సుందరగిరి జీపీవో), ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం అంజయ్య (లంబాడిపల్లి జీపీవో), కోశాధికారి తాటిపల్లి రాములు (బొమ్మనపల్లి జీపీవో) ఎన్నిక కాగా...కార్యవర్గ సభ్యులుగా వరుకోలు శ్రీనివాస్ (నవాబుపేట), పొందుర్తి శ్రీనివాస్ (ఇందుర్తి), తేల్ల బాలరాజు (ముదిమాణిక్యం), ఏనుగు రాజాబాబు (బొమ్మనపల్లి), శ్రీ మహమ్మద్ రఫీ (సుందరగిరి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ అభినందించారు.

జీవో 46 పై భగ్గుమన్న బీజేపీ శ్రేణులు

- రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ ఆందోళన

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 29 : బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 46 పై కరీంనగర్ బీజేపీ శ్రేణులు భగ్గుమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు అడిచర్ల రాజు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి , జీవో 46 ప్రతులను దహనం చేశారు. ఈ ప్రోగ్రాం లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్ , ఓబీసీ రాష్ట్ర నాయకులు అడిచర్ల రాజు లు మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ చేసిన వాగ్దానాలన్నీ నీటి మూటలేనని స్పష్టంగా బీసీ సమాజానికి అర్థమైందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరిట కాంగ్రెస్ ఇన్నాళ్లు రాజకీయ డ్రామాలు చేసిందని , నేడు జీవో 46 జారీ చేసి బీసీలకు రిజర్వేషన్లను తగ్గించి కాంగ్రెస్ సర్కార్ బీసీ ప్రజానీకాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రస్తుతం స్థానిక సంస్థల్లో బీసీలకు కేవలం 22 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం దారుణం అన్నారు. దీంతో ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. జీవో 46 ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేకపోతే జరగబోయే ఎన్నికల్లో బీసీలు రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుజ్జ శ్రీనివాస్, బండ రమణారెడ్డి ,ఏన్నం ప్రకాష్ , నరహరి లక్ష్మారెడ్డి ,గుంజేటి శివకుమార్, శానగొండ వాసు, నాంపల్లి శ్రీనివాస్, మాసం గణేష్, అవదుర్తి శ్రీనివాస్ ,తిరుపతి సుధాకర్ పటేల్ ,హరి ప్రసాద్ పటేల్ ,ఎడ్ల ప్రసన్న, రంగు సంపత్ గౌడ్, కట్ట రాజు, వొద్నలా కోటేశ్వర్ బోయిని శ్రీనివాస్, పైడి ప్రసాద్ పర్వతం మల్లేశం, బత్తిని మహేష్, అజయ్, నారాయణ,తిరుమల్ రెడ్డి, కచ్చకాయల, రాజేంద్రప్రసాద్, గుంటుక శంకర్ తోపాటు వివిధ మోర్చా బాధ్యులు, కరీంనగర్ జోన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలు పెంచుకోవాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 29: విద్యార్థులు ప్రకృతితో మమేకమవుతూ సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు, ప్రాజెక్టులు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో 2025-26 సంవత్సర జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్స్పైర్ అవార్డ్స్ మనాక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా క్రమం తప్పకుండా మన జిల్లా నుండి సైన్స్ ఎగ్జిబిట్ లు రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం, అక్కడి నుండి జాతీయస్థాయికి ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం అని అన్నారు. ఏ జిల్లాలో లేని విధంగా కరీంనగర్ లో సైన్స్ మ్యూజియం ఉందని, ప్రభుత్వ, ప్రైవేట్ పిల్లలు ఎవరైనా మ్యూజియం సందర్శించవచ్చని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా విద్యార్థులు బాలశాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని కాబట్టి విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని తెలియజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ మొండయ్య మాట్లాడుతూ

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలన్నింటి నుంచి ఈ ప్రదర్శనలో భాగస్వామ్యం ఉండడం సంతోషదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలని, ఆలోచనల్,లో ప్రవర్తనలో వైజ్ఞానికత ఉండాలన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి, వారిని బాల శాస్త్రవేత్తలుగా

రూపొందించడానికి ఇన్స్పైర్ పురస్కారాల పేరుతో అధిక నిధులు వెచ్చిస్తున్నదని, దానిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల అన్ని మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిల్ట్ పాలసీ పేరిట రూ.6.29 లక్షల కోట్ల విలువైన భూమిని 5వేల కోట్లకే కట్టబెట్టడంపై ప్రభుత్వం ఎందుకు చర్చకు రావడం లేదు. కోకాపేటలో ఎకరం రూ.151 కోట్లుండగా పారిశ్రామికవాడల్లో రూ.54 లక్షలకే ఇచ్చేయడం లూటీ కాదా?. 'హిల్ట్ పాలసీ పెద్ద స్కామ్. నిరూపించలేకుంటే ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తా. నిజమని తేలితే సీఎం, సబ్ కమిటీ మంత్రులు రాజీనామా చేయాలి.

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

ప్రాంతీయం

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తాం

- నూతన డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి
- డిసెంబర్ 1న ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని ఆహ్వానం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 29 : రానున్న స్థానిక సంస్థల అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జండా ఎగుర వేస్తామని జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ ఫలాలు అమలు చేస్తుందని, దాంతో జిల్లాలో ఉన్న అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటామని, తద్వారా జిల్లా పరిషత్, జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలిపించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షుడిగా నియమితులయ్యాక శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగేష్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లకు నగేశ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులను అధిక సంఖ్యలో గెలిపించుకుంటామన్నారు. జిల్లాలోని అందరు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని కొత్త డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతులకు రుణమాఫీ, రూ.500 బోనస్‌తో పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రైతులకు అండగా ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనను అందిస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కే సిలిండర్ గ్రామాల్లోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు, ప్రతి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

డిసెంబర్ 1న ప్రమాణ స్వీకారోత్సవం ....

డిసెంబర్ 1న నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు నగేష్ రెడ్డి తెలిపారు. తన ప్రమాణ స్వీకారానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్,నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, జావేద్ అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

నాటి 'దీక్షాదివస్' తెలంగాణ సాధించిన దివ్యాస్త్రం

- నేడు కాంగ్రెస్, బీజేపీని బొంద పెట్టే బ్రహ్మాస్త్రం
- తెలంగాణ, కేసీఆర్ వేర్వేరు కాదు
- నిజామాబాద్ జిల్లా గులాబీ గడ్డ కేసీఆర్ అడ్డా
- నిజామాబాద్ 'దీక్షాదివస్'లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబరు29 : నాటి 'దీక్షాదివస్' తెలంగాణ సాధించిన దివ్యాస్త్రం. నేడు ప్రజా వ్యతిరేక కాంగ్రెస్, బీజేపీ లను బొంద పెట్టే బ్రహ్మాస్త్రం అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్ లో శనివారం నిర్వహించిన 'దీక్షాదివస్' కార్యక్రమంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో కేసీఆర్ ది ఎప్పటికీ చెరిపేయలేని సంతక మన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడం ఎవరివల్ల కాదన్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టిన 'దీక్షా దివస్' చరిత్రలో చెరిగిపోని సంతకం. ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సాకారం చేసిన దమ్మున్న నేత కేసీఆర్ అన్నారు. కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో నవంబర్ 29, 2009 న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసిందన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ రాజకీయ వ్యవస్థను, 36 పార్టీలను ఒప్పించి, మెప్పించి రాష్ట్రం సాధించిన గొప్ప ఉద్యమ నేత కేసీఆర్ అన్నారు. కేసీఆర్ తెలంగాణ చెట్టు తల్లి వేరు లాంటివారని ఎవడో వచ్చి పీకేయడానికి కేసీఆర్ మొక్కకాదని, వటవృక్షమని స్పష్టం చేశారు. కేసీఆర్ ను ఏదో పీకుతామని శపథాలు చేసిన వైఎస్ , చంద్రబాబు, కిరణ్ కుమార్ రెడ్డి వంటి జెండాలు పీక్కొని పోయారని, తెలంగాణ, కేసీఆర్ ను వేర్వేరుగా చూడలేమన్నారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పిలుపుమేరకు గల్లి నుండి ఢిల్లీ వరకు ఎన్నో ఉద్యమాల్లో కార్యకర్తలుగా పాల్గొని ప్రజలకు ప్రాతినిధ్యం వహించామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై కెసిఆర్ ఆమరణ దీక్ష చేసి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపి ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందించామన్నారు.

సమరోత్సాహంతో దీక్షాదివస్

జై తెలంగాణ నినాదాల హోరుతో సమరోత్సాహంతో నిర్వహించిన 'దీక్షాదివస్' కార్యక్రమంలో గులాబీ శ్రేణులు వెల్లువలా తరలి వచ్చారు.దీక్ష దివాస్ సందర్భంగా వినాయక్ నగర్ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దీక్షాదివస్ కర్మ, కర్త, క్రియ అయిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినరక్తదాన శిబిరంలో బీ ఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు రక్తదానం చేశారు. పార్టీ కార్యాలయం లోనే అన్నదాన కార్యక్రమం కూడా పెద్ద ఎత్తున జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్న గారి విటల్ రావు , మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, బోధన్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆయేషా షకీల్, మాజీ నగర మేయర్ దండు నీతి కిరణ్ శేఖర్, బాజిరెడ్డి జగన్, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు సిర్ప రాజు, సీనియర్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్ చింతా మహేష్, మోహన్ రెడ్డి దండు చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఉద్యమకారులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జడ్పీ సీఈవోగా గోవింద్ చేసిన సేవలు మరువలేనివి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 29 : ప్రతి ఉద్యోగి జీవితంలో పదవి విరమణ పొందడం సహజమని తెలిపారు. జెడ్పీ సీఈవో గా ఇస్లావత్ గోవింద్ చేసిన సేవలు మరువలేనివి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సీఈవో గోవింద్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోవింద్ నిత్యం అందుబాటులో ఉంటూ, తన కర్తవ్యాన్ని క్రమశిక్షణతో నిర్వర్తించారని అన్నారు. జిల్లా ఇంచార్జ్ ఉపాధి కల్పన అధికారిగా కూడా ఆయన చేసిన సేవలు మరువలేనివి అన్నారు. ఆ వివిధ శాఖల్లో, వివిధ హోదాల్లో మచ్చలేకుండా తన ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని అన్నారు. నూతనంగా ఉద్యోగంలోకి చేరిన ఉద్యోగులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం జీవితం మొత్తం కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాక్షించారు. ఉద్యోగ విరమణ అనంతరం అవసరైనపుడు ఉద్యోగులకు తన సలహాలు అందివ్వాలని తెలిపారు. అనంతరం జెడ్పీ సీఈవో గోవింద్ మాట్లాడుతూ, తన ఉద్యోగ జీవితంలోని అనుభవాలను పంచుకున్నారు. సర్వీసులో సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు కలెక్టర్, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా తన సూచనలు అధికారులకు అందిస్తానని అన్నారు. ఆ తర్వాత జెడ్పీ సీఈవో గోవింద్ దంపతులను జిల్లా కలెక్టర్, అధికారులు, కుటుంబ సభ్యులు పూల మొక్కలను అందించి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, జెడ్పీ సీఈవో కుటుంబ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

- ఆర్.ఓలు, ఏ.ఆర్.ఓ శిక్షణలో కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 29 : గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం ఆర్.ఓలు, ఏ.ఆర్.ఓలకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులపై పునఃశ్చరణ కల్పించేందుకు శనివారం శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చట్టబద్ధతతో కూడిన ఎన్నికల విధులను ఎంతో జాగరూకతతో నిర్వర్తించాల్సి ఉంటుందని, నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించవచ్చని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని శిక్షణ తరగతుల్లో సూచించే అంశాలను శ్రద్ధగా విని ఆకళింపు చేసుకోవాలని, ఎన్నికల సంఘం ద్వారా అందించబడిన హ్యాండ్ బుక్ (కర దీపిక) ను చదువుకుని ఈ.సీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు స్థానాల కోసం పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేకంగా కొత్త బ్యాంకు ఖాతాను తెరువాల్సి ఉందని, ఈ ఖాతా ద్వారానే ఎన్నికల కార్యకలాపాలకు సంబంధించిన లావాదేవీలు జరపాలని ఈ.సీ నిర్దేశించినందున నామినేషన్ పత్రాల కోసం వచ్చే అభ్యర్థులకు ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను ఈ.సీ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటించాలని. అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరపున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పేపర్ లో అభ్యర్థుల పేర్లను అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని, ఓటరు జాబితాలోని అభ్యర్థి పేరును అక్షర క్రమం కోసం పరిగణలోకి తీసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని అన్నారు. వెంటదివెంట రోజువారీ రిపోర్టులను పంపించాలని, అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి ఆన్ లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన మీదట బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా రూపొందించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు "నోటా" సింబల్ ను కూడా తప్పనిసరిగా చేర్చాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి తప్పిదాలను తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని, జిల్లాకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీనివాస్ రావు, డీఎల్పీఓ శ్రీనివాస్, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 29: జిల్లా కేంద్రంలోని చిన్నమల్లారెడ్డి లో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం సందర్శించారు. వరి కొనుగోలు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్, అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి కొనుగోలు ను వేగవంతం చేయాలని, అవసరమైన టార్పాలిన్ షీట్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని,రోజువారీగా ఎన్ని క్వింటాళ్ల వరి లోడింగ్ జరుగుతున్నది అన్న దాని పై పర్యవేక్షణ పెంచాలని ఐకెపి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. వరి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, ఏపీఎం మెప్మా శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కేసీఆర్ తోనే తెలంగాణ

- రాష్ట్ర దశ దిశా మార్చిన ఘనుడు
- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

ప్రతిపక్షం, బాన్సువాడ, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర సాధన దశ, దిశ మార్చిన ఘనత కేసీఆర్ కు మాత్రమే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. 16 ఏళ్ల క్రితం నవంబర్ 29న తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో నినాదంతో నిరాహార దీక్షను కేసీఆర్ ప్రారంభించారన్నారు. దీక్ష దివస్ సందర్భంగా శనివారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు బీఆర్ఎస్ కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదని, తెలంగాణ ఉద్యమానికి కేసీఆర్ ఊపిరి పోశారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పాలనలో అన్నిరకాలుగా విఫలమైందని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అమలు కాని హామీలన్నీ ఇచ్చి ప్రస్తుతం చేతులెత్తేసిందని విమర్శించారు. కేసీఆర్ బాన్సువాడకు ఇచ్చినన్ని నిధులు ఏ నియోజవర్గానికి ఇవ్వలేదని తెలిపారు. రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.50 లక్షల కోట్లు అప్పులు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు అంజి రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ జుబేర్, మోచి గణేష్, సాయిబాబా, రమేష్ యాదవ్, నాయిని మొగులయ్య, బోడ చందర్, శివసూరి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాలను సందర్శించిన పరిశీలకులు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 29 : గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు జీ.వీ. శ్యాంప్రసాద్ లాల్ నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను శనివారం సందర్శించారు. మోస్రా, చందూర్, వర్ని సత్యనారాయణపురం, బోధన్ మండలం సంగెం గ్రామ పంచాయతీలలో కొనసాగిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. నామపత్రాలు స్వీకరిస్తున్న తీరును గమనించి, పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా స్వీకరణ ప్రక్రియ జరుగుతోందా అని నిశిత పరిశీలన చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. అబ్జర్వర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

డిజిటైజేషన్‌తో సత్ఫలితాలు

- కాగితాల నుండి కంప్యూటర్ల వైపు కోర్టుల ప్రస్థానం
- యువ న్యాయవాదులు నిరంతరం చదవాలి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 29 : కాగితాల నుండి కంప్యూటర్ల వైపు ప్రపంచం పరుగులు పెడతోందని, దానిని అందింపుచ్చుకుని డిజిటైజేషన్ కు న్యాయస్థానాల ప్రస్థానం నడక ప్రారంభమైందని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్, నిజామాబాద్ పోర్ట్ పోలియో జడ్జి టీ మాధవి దేవి తెలిపారు. శనివారం నిజామాబాద్ జిల్లాకోర్టులో డిజిటైజేషన్ కోర్టు రికార్డుల డిజిటైజేషన్ ప్రాజెక్ట్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారత లక్ష్మీ, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్ రెడ్డి, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజు, అదనపు జిల్లాజడ్జిలు హరీష, శ్రీనివాస్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె న్యాయవాదులు, కోర్టు సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. కోర్టులలో న్యాయ వివాదాల దావాలు, క్రిమినల్ కేసుల రూపంలో ఉన్న కాగితాల కట్టల మూటలను కనబడని రీతిలో కంప్యూటర్లలో నిక్షిప్తం చేయడం జరుగుతున్నదని, డిజిటైజేషన్ తో సత్ఫలితాలు సిద్దిస్తాయని ఆమె పేర్కొన్నారు. లక్షలాది కాగితాలను కట్టలన్నీ స్కానింగ్ మిషన్లో స్కానింగ్ చేసి కంప్యూటర్లో భద్రపరచడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. భీంగల్ మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు ఆర్థిక అనుమతులు వచ్చాయని, త్వరలోనే కోర్టు ఏర్పాటు అవుతుందని వెల్లడించారు. కోర్టుకు అనుకుని ఉన్న పాత విద్యాశాఖ ఖాళీ స్థలాన్ని జిల్లాకోర్టు అవసరాలకు అనుగుణంగా కేటాయించడానికి వీలుగా జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తో సంప్రదించినట్లు ఆమె న్యాయవాదుల హర్షధ్వనాల మధ్య వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భారత లక్ష్మీ మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ లో న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య సమన్వయం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు మంతెని రాజేందర్ రెడ్డి, బార్ అధ్యక్షుడు సాయరెడ్డి, అదనపు జిల్లా జడ్జిలు హరీష, శ్రీనివాస్, బార్ కార్యదర్శి మాణిక్ రాజు, సీనియర్ సివిల్ జడ్జి సాయిసుధ, జూనియర్ సివిల్ జడ్జిలు ఖుష్ ఉపధ్యాయ, గోపికృష్ణ, హరి కుమార్, చైతన్య, శ్రీనివాస్ రావు, ప్రభుత్వ న్యాయవాది అమిదాల సుదర్శన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌ఆఫ్రికాతో టెస్ట్ సిరీస్ ఓటమిని మర్చిపోయి వన్డే సిరీస్ గెలవడంపై దృష్టి పెడతాం. సౌతాఫ్రికాతో తొలి వన్డేలో రోహిత్, కోహ్లీ ఉండటం వల్ల డ్రెస్సింగ్ రూమ్‌లో కాన్ఫిడెన్స్ పెరుగుతుంది. ఈ సిరీస్‌లో రుతురాజ్‌కు అవకాశం ఇవ్వాలని అనుకుంటున్నాం. పంత్ ఆడితే అతడే కీపర్ బాధ్యతలు తీసుకుంటాడు. స్పిన్‌ను బెటర్‌గా ఆడటంపై దృష్టిపెడుతున్నాం.

-టీమ్ ఇండియా కెప్టెన్ కేఎల్‌రాహుల్

ప్రాంతీయం

ఆర్కియాలజీ అధికారులపై కేంద్ర మంత్రి ఆగ్రహం

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 29: వరంగల్ వేయి స్తంభాల గుడి ఆర్కియాలజీ అధికారుల పై మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పర్యటనలో భాగంగా ఆయన వేయి స్తంభాల గుడిని పరిశీలించారు. గుడి కళ్యాణ మండపం పనుల నిర్లక్ష్యంపై ఆయన మండిపడ్డారు. ఆరు నెల కాలం నుండి ఏం చేస్తున్నారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరాలు గడుస్తున్న పనులు జరగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వర్కర్ల పనితీరును ప్రశ్నించి, పర్యవేక్షకుడిగా ఆర్కియాలజీ అధికారిని వివరణ ఇవ్వాలని, దేవాలయం పనుల పూర్తి నివేదిక ఇవ్వాలని కిషన్ రెడ్డి ఆదేశించారు.

వరంగల్ లోని భద్రకాళి ఆలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న కిషన్ రెడ్డికి ఆలయ సంప్రదాయాల ప్రకారం ఆలయ ఈ ఓ సునీత ప్రధాన అర్చకులు శేషు కేంద్ర మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.
- ప్రతిపక్షం, హనుమకొండ



విత్తనచట్టం 2025 పై చర్చలో జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, నవంబర్ 29: ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి, నకిలీ విత్తనాలపై నిషేధం విధించడానికి, విత్తనాల దిగుమతిని సరళీకరించడానికి మరియు రైతు హక్కులను రక్షించడానికి నూతన విత్తన చట్టం ముసాయిదా ప్రతిపాదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భారత ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా పై చేయవలసిన మార్పులు, చేర్పులపై రైతులు, విత్తన డీలర్లు, ఇన్ పుట్ డీలర్లు, రైతు సంఘాలు తమ అమూల్యమైన సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ వాణిజ్య ప్రక్రియల సరళీకరణ, నిబంధనల ఉల్లంఘన జరిగినపుడు కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. నాణ్యత, నియంత్రణ చర్యలు వంటి అంశాలను ఈ చట్టంలో స్పష్టంగా ఆయన పొందుపరిచినట్లు వివరించారు. పార్లమెంటులో ఈ చట్టాన్ని ఆమోదించడానికి ముందు, రైతులు, ఎన్‌జీఓలు, రైతు సంఘాలు, లబ్ధిదారుల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించి, వాటిని ముసాయిదాలో పొందుపరిచి ఆమోదం తర్వాతే ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. ప్రతిపాదిత చట్టంలో మొత్తం 10 అధ్యాయాలు, 48 విభాగాలు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. 1966 విత్తన చట్టంలోని లోపాలను సవరించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన చట్టం రూపొందించబడినట్లు చెప్పారు.ఇలాంటి కీలక చట్టంపై ప్రతి రైతు తమ అభిప్రాయాలు, సూచనలు తప్పక తెలియజేయాలని వాటిని క్రోడీకరించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక రూపంలో అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ నరేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ఉద్యాన వన అధికారి సునీల్ కుమార్, మహదేవపూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీపాల్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎన్నికల పరిశీలకులు

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, నవంబర్ 29: భూపాలపల్లి జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియను, సౌకర్యాలను, నామినేషన్ కేంద్రాలను గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి పరిశీలించారు. భూపాలపల్లిజిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఫణీంద్ర రెడ్డి కోరారు. శనివారం రేగొండ మండలంలోని పలు గ్రామ పంచాయతీలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. రేగొండ, రంగయ్యపల్లి, దమ్మన్నపేట, మొగుళ్లపల్లి, రంగాపూర్, రూపిరెడ్డిపల్లి చెక్‌పోస్ట్‌లను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని నిశిత పరిశీలన చేయాలని సూచించారు. నామినేషన్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలను, నామినేషన్ల స్వీకరణ విధానాన్ని సమీక్షించారు. ఆర్.ఓ., ఏఆర్.ఓ.ల తో మాట్లాడి నామినేషన్ పత్రాల పరిశీలన, రికార్డుల నిర్వహణ, అభ్యర్థులకు అందించే మార్గదర్శకాలపై సూచనలు ఇచ్చారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎఫ్ ఎస్ టి బృందాలతో మాట్లాడి ఇప్పటివరకు చేసిన తనిఖీలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు, చేపట్టిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళి అమలులో పటిష్ట పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. ఎన్నికలను శాంతియుతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించేందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని అధికారులకు సూచించారు.

ప్రజల ఆకాంక్షను వినిపించిన చారిత్రక రోజు ఇది

- **దీక్షా దివస్ లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**

ప్రతిపక్షం, నర్సంపేట, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాది వేసిన చారిత్రక ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభమైన రోజు అయిన కేసీఆర్ దీక్ష దివస్ శనివారం నర్సంపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, 2009 నవంబర్ 29న జరిగిన కేసీఆర్ దీక్ష తెలంగాణ ప్రజల చరిత్రను మార్చిన అపూర్వ ఘట్టమని పేర్కొన్నారు. ఉద్యమ నేత కేసీఆర్ "తెలంగాణ వచ్చుడో - కేసీఆర్ సచ్చుడో" అనే నినాదంతో ప్రాణాలను సైతం పణంగా పెట్టి చేపట్టిన ఈ ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఊపందుకుని తెలంగాణ రాష్ట్ర సాధనకు బలమైన పునాదులు ఏర్పడ్డాయని ఆయన గుర్తుచేశారు. అన్ని వర్గాల తెలంగాణ ప్రజలను ఏకం చేసిన ఈ దీక్ష, సమగ్ర భారతదేశ రాజకీయ వ్యవస్థను కదిలించి, దశాబ్దాలుగా కొనసాగుతున్న స్వరాష్ట్ర ఆశయాన్ని నెరవేర్చే దిశగా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని పేర్కొన్నారు. "కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు తెలంగాణ ప్రజల ఆకాంక్షను వినిపించిన చారిత్రక రోజు ఇది" అని ఆయన చెప్పారు. అమరవీరుల త్యాగాలతో సాగిన తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పదవులను పక్కన పెట్టి, ఉద్యమ లక్ష్యం కోసం చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ ఎస్ ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, పట్టణ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, జిల్లా నాయకులు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన నాయకులు, మహిళా అధ్యక్షురాలు, మహిళా కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమాన్ని ఉధృతం చేసిన కేసీఆర్

- **కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన విద్యార్థి నేతలు**

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 29: 16 ఏళ్ల క్రితం కేసీఆర్ మలిదశ ఉద్యమాన్ని ఉధృతం చేసి దీక్ష పూనిన రోజుకు గుర్తుగా, దీక్షా దివాస్ ను ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతుందని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్ అన్నారు.దీక్షా దివాస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని నిరంజన్ రెడ్డి నివాసంలో విద్యార్థులు, విద్యార్థి నాయకులచే కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా హేమంత్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తామని తెలిపారు.కేసీఆర్ యావత్ తెలంగాణ లోకాన్ని జాగృతం చేసి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ను సాధించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాధవరావుపల్లె సునీల్, మంద రాము, చిట్యాల రాము, ప్రేమ్ కుమార్,వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, కంచె రవి, నాగన్న యాదవ్, చంద్రశేఖర్, రామకృష్ణ, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- **బీజేపీ రాష్ట్ర నాయకులు బి.కొండయ్య**

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 29: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి బిజెపి కార్యకర్త పనిచేయాలి అని బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మక్తల్ పట్టణంలో బీజేపీ మక్తల్ మండల మాజీ అధ్యక్షులు లక్మణ్ అధ్యక్షతన నిర్వహించిన వివిధ గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొండయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్పంచ్ మరియు వార్డు సభ్యుల స్థానానికి పోటి చెయ్యాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చెయ్యాలని అన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు మంజూరు అవుతాయని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానలలో బీజేపీ అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో గెలుపొందాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు సోమశేఖర్ గౌడ్, కల్లూరి నాగప్ప, ప్రతాప్ రెడ్డి, చిట్యాల లక్ష్మణ్, కుర్వ హనుమంతు, నారాయణ, మజ్జిగ సురేష్, ఉశేనప్ప, వన్నవాడ శ్రీకాంత్, సత్య శ్రీను, అశోక్ గౌడ్, శ్రీను వాసులు, తిమ్మప్ప, కుర్వ లింగం, బ్యాటిరి రాజు, రాజా గౌడ్, తిరుపతి వివిధ గ్రామాల బూత్ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ లోకి చేరికలు

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 29: కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని,గత బిఆర్ఎస్ పాలనలో వనపర్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నట్లు మాజి మంత్రి. నిరంజన్ రెడ్డి అన్నారు. మాజీ జిల్లా రైతు సమితి అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దమందడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నుండి స్వాతి, హరికుమార్ రెడ్డి,యాదిరెడ్డితో పాటు 200మంది బిఆర్ఎస్ పార్టీలో చేరారు.అదేవిధంగా అంకాయపల్లి తాండా నుండి మొత్యా నాయక్, చంద్రు, బుచన్న,నాగరాజుతో పాటు 100మంది కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారికి నిరంజన్ రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు.

చరిత్రలో నిలిచిపోయే 'కేసీఆర్ దీక్ష'

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ దీక్ష చరిత్రలో నిలిచిపోతుందని పలువురు బీఆర్ఎస్ నేతలు అన్నారు. నారాయణపేట జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం దీక్షా దివాస్ కార్యక్రమ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ శాసన సభ్యులు ఎస్ రాజేందర్ రెడ్డి, మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లి దశ తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేసిన నిరవధిక నిరాహార దీక్ష చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. 2009 నవంబర్ 29న నిరాహార దీక్ష చేపట్టిన కేసీఆర్ డిసెంబర్ 9న ప్రకటించిన తర్వాతనే విరమించాడని కొనియాడారు. అనంతరం తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తు చేసుకుంటు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు సింగిల్ విండో చైర్మన్లు,డైరెక్టర్లు, మాజీ జడ్పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు, అన్ని గ్రామాల మాజీ సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ధాన్యం విక్రయించిన రైతుల

వివరాలను ట్యాబ్ లో వెంటనే నమోదు చేయాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 29 : ధాన్యం విక్రయించిన రైతు వివరాలను వెంటనే ట్యాబ్ లో నమోదు చేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని మల్లికుదుర్ల, వేలేరు లలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు ఎంతమంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేశారని, ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్ లో ఎందుకు ఎంట్రీ చేయలేదని కలెక్టర్ నిర్వాహకులను అడిగారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎన్ని గన్నీ సంచులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను కలెక్టర్ అడిగారు. కొనుగోలు కేంద్రాలలో రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ధాన్యం కాంటా పూర్తయిన వెంటనే ట్యాబ్ లో రైతు వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లో చెల్లింపు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గన్నీ సంచులను భద్రపరచుకోవాలని సూచించారు. ధాన్యం కాంటాలు పూర్తికాగానే సంబంధిత మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ఏరోజుకు ఆ రోజుకే నమోదు చేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.

విద్యార్థులు ఆంగ్ల భాషను మెరుగుపరచుకోవాలి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆంగ్ల భాషను మరింత మెరుగు పర్చుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శనివారం వేలేరులోని ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా 6, 7 తరగతులను, ప్రాథమిక పాఠశాలలోని మూడో తరగతి ని కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆంగ్ల భాషలో బోధన సాగుతుందా అని, పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయా అని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మిడ్లైన్ టెస్ట్ జరగగా పరీక్షా పత్రాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులను ఆంగ్ల భాషలోని రైమ్స్, పదాలను గురించి అడిగారు. ఉపాధ్యాయులను ఇంగ్లీష్ ఎన్ రీచ్ మెంట్ ప్రోగ్రాం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంగ్ల భాషను విద్యార్థులు తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు.

తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్

వేలేరు తహసిల్దార్ కార్యాలయాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సాదా బైనామా దరఖాస్తులు, సాధారణ ఫైళ్లు, పిఓటి, భూభారతి దరఖాస్తులు, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు గురించి తహసిల్దార్ కోమి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తుల పరిష్కార చర్యలను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా డిఆర్డిఓ మేన శ్రీను, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఎంఈఓ చంద్రమౌళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షా ల సమయంలో ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలి. సాయం కోసం టోల్ ఫ్రీ నంబర్లను 112, 1070, 18004250101 సంప్రదించాలి. రేపు, ఎల్లుండి ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు ప్రభావిత జిల్లాలను అలర్ట్ చేయాలి. సహాయక చర్యలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పంపించాలి.

- అధికారులతో సమీక్షలో ఏపీ మంత్రి అనిత

ఆ దేశాల నుండి వలసలు నిషేధం

- నిర్ణయం తీసుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 28: వైట్ హౌస్ సమీపంలో ఇద్దరు నేషనల్ గార్డు సిబ్బందిపై ఓ అఫ్గాన్ జాతీయుడు కాల్పులు జరిపిన నేపథ్యంలో అమెరికా వ్యవస్థ సంపూర్ణంగా కోలుకునేందుకు వీలుగా థర్డ్ వరల్డ్ దేశాలు (పేద దేశాలు) అన్నిటి నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. ఈ చర్య ప్రపంచ దేశాలపైన ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు ఉపాధి, విద్య కోసం, తమ దేశాలలో ఎదురవుతున్న వేధింపులను తప్పించుకునేందుకు అమెరికాకు వలసపోతున్న కోట్లాది మంది విదేశీయులపై తీవ్ర ప్రభావం చూపనున్నది. తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ ద్వారా ఈ విషయాన్ని ట్రంప్ తెలియచేస్తూ సాంకేతికంగా అమెరికా పురోభివృద్ధి చెందినప్పటికీ దాని వలస విధానం ఆ ప్రయోజనాలను, అనేక మంది జీవన పరిస్థితులను దెబ్బతీసినట్లు పేర్కొన్నారు. అమెరికా వ్యవస్థ పూర్తిగా కోలుకునేందుకు మూడవ ప్రపంచ దేశాలు అన్నిటి నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తానని ఆయన ప్రకటించారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో చట్టవ్యతిరేకంగా దేశంలోకి జరిగిన కోట్లాది మంది ప్రవేశాలను రద్దు చేస్తానని ఆయన తెలిపారు. అమెరికా అభివృద్ధికి పనికిరాని, తమ దేశాన్ని ప్రేమించడం చేతకాని ఎవరినైనా దేశం నుంచి పంపించివేస్తామని ఆయన హెచ్చరించారు.

విశ్వ వీక్షణం

నాటుకోళ్లను తినాలా? బ్రాయిలర్ కోళ్లను తినాలా..? వీటిల్లో దేంట్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి, ఏవి మనకు ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.. అని చాలా మంది ఆలోచిస్తుంటారు. అయితే ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

నాటుకోడి.. బ్రాయిలర్ కోడి

ఏది తినాలి..?

ఆదివారం వస్తుందంటే చాలు నాన్ వెజ్ ప్రియులు వేటిని తిందామా అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందులో భాగంగానే చికెన్, మటన్, చేపలు, రొయ్యలు వంటి వాటిని ఇంటికి తెచ్చుకుని తింటారు. లేదా బయట హోటల్స్ లో లాగించేస్తారు. అయితే అధిక శాతం మంది మాత్రం చికెన్‌ను తింటుంటారు. చికెన్‌తోనే అనేక వెరైటీలను చేసి తింటుంటారు. అయితే చికెన్ తినేవారు చాలా మంది నాటుకోడికి ప్రాధాన్యతను ఇస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే సహజసిద్ధంగా పెరిగిన నాటు కోళ్లు లభిస్తాయి. పట్టణాలు, నగరాల్లో ఫామ్‌లలో పెరిగిన నాటు కోళ్లను విక్రయిస్తారు. అయితే వాస్తవానికి నాటుకోళ్లను తినాలా, బ్రాయిలర్ కోళ్లను తినాలా..? వీటిల్లో దేంట్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి, ఏవి మనకు ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.. అని చాలా మంది ఆలోచిస్తుంటారు. అయితే ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

తేడాలు ఇవే..

నాటు కోళ్లు సహజసిద్ధంగా పెరిగేవి అయితే తమ ఆహారాన్ని తామే వెతుక్కుంటాయి. ఇవి చిన్న చిన్న పురుగులు, విత్తనాలు, ధాన్యాలు, గడ్డి వంటి వాటిని తిని పెరుగుతాయి. అదే బ్రాయిలర్ కోళ్లు అయితే ఫాం యజమానులు వీటిని త్వరగా విక్రయించాలి కనుక ఇవి వేగంగా పెరిగేందుకు గాను ప్రత్యేకమైన ఆహారం పెడతారు. ఇక నాటు కోళ్లు పూర్తి స్థాయిలో పెరిగేందుకు కనీసం 4 నుంచి 6 నెలల సమయం పడుతుంది. కానీ బ్రాయిలర్ కోళ్లు 5 నుంచి 9 వారాల్లో పెరుగుతాయి. నాటు కోళ్లు సహజసిద్ధంగా పెరుగుతాయి కనుక వీటి మాంసం అనేక పోషకాలను కలిగి ఉంటుంది. అలాగే నాటు కోళ్ల మాంసం రుచిగా కూడా ఉంటుంది. బ్రాయిలర్ కోళ్ల మాంసంలో పోషకాల శాతం గణనీయంగా తగ్గుతుంది. కొవ్వు పెరుగుతుంది. పైగా ఈ మాంసం పెద్దగా రుచిగా కూడా ఉండదు. నాటు కోళ్లలో కండరాలు అధికంగా కొవ్వు తక్కువగా ఉంటే, బ్రాయిలర్ కోళ్లలో కండరాలు తక్కువగా కొవ్వు ఎక్కువగా ఉంటుంది.

100 గ్రాముల వండిన మాంసం ఆధారంగా సగటు పోషక విలువలు

(USDA & భారతీయ అధ్యయనాల ఆధారంగా)

పోషకం	నాటు కోడి (దేశీ)	బ్రాయిలర్ కోడి
క్యాలరీలు	150-170 క్యాలరీలు	200-240 క్యాలరీలు
ప్రోటీన్	25–28 గ్రాములు	22-25 గ్రా
మొత్తం కొవ్వు	4-7 గ్రాములు	12-18 గ్రా
సాచురేటెడ్ ఫ్యాట్	1-2 గ్రాములు	4-6 గ్రా
జింక్	2.5-3.5 మిల్లీగ్రాములు	1.5-2.0 మిల్లీగ్రాములు
విటమిన్ B3 (నియాసిన్)	ఎక్కువ	తక్కువ
కొలెస్ట్రాల్	50-70 మిల్లీగ్రాములు	80–100 మిల్లీగ్రాములు

వేటిని తినాలి..?

నాటు కోళ్ల మాంసం ధర ఎక్కువగా ఉంటుంది. బ్రాయిలర్ కోళ్లు తక్కువ ధరకే లభిస్తాయి. నాటు కోళ్లు పెరిగేందుకు సాధారణంగా యాంటీ బయోటిక్స్, మందులను ఉపయోగించరు. కానీ బ్రాయిలర్ కోళ్లు పెరిగేందుకు మాత్రం కచ్చితంగా మందులను ఇస్తారు. వాటి వల్లే అవి త్వరగా పెరుగుతాయి. కనుక ఎలా చూసినా కూడా నాటు కోళ్లే మనకు ఎక్కువ పోషకాలను, ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని చెప్పవచ్చు. కనుక బ్రాయిలర్ కోళ్ల కన్నా కూడా నాటు కోళ్లను తినడమే శ్రేయస్కరమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నాటుకోళ్లలో జింక్ అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తి పెరిగేందుకు సహాయం చేస్తుంది. తెల్ల రక్త కణాల సంఖ్యను పెంచుతుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా దగ్గు, జలుబు తగ్గుతాయి. అలాగే నాటుకోడి మాంసంలో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో రక్తహీనత తగ్గుతుంది.

అనేక పోషకాలు..

నాటుకోడి మాంసంలో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ బి12 మనకు అధికంగా లభిస్తుంది. ఇది నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. నాడీ సంబంధ సమస్యలు, మెడ, భుజాల నొప్పులను తగ్గిస్తుంది. శరీరంలో శక్తి స్థాయిలు పెరిగేలా చేస్తుంది. మెటబాలిజంను మెరుగు పరుస్తుంది. చాలా మందికి విటమిన్ బి12 లోపం ఉంటుంది. అలాంటి వారు నాటు కోడి మాంసాన్ని తింటుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. నాటు కోళ్లలో కొవ్వు శాతం చాలా తక్కువగా, కండరాల శాతం అధికంగా ఉంటుంది. కనుక హై క్వాలిటీ ప్రోటీన్లను పొందవచ్చు. దీని వల్ల మన కండరాలకు శక్తి లభిస్తుంది. ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. ముఖ్యంగా శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారికి నాటు కోడి మాంసం ఎంతో మేలు చేస్తుంది. ఈ మాంసంలో ఒమెగా 3, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. కనుక ఈ మాంసాన్ని తింటే శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చు. ఇలా నాటు కోడి మాంసంతో లాభాలను పొందవచ్చు.

కర్ణాటక సీఎం పదవిపై వివాదానికి తాత్కాలికంగా తెర

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, నవంబర్ 29: కర్ణాటక లో సీఎం పదవిపై గత కొంతకాలంగా కొనసాగుతున్న వివాదానికి ఇవాళ తాత్కాలికంగా తెరపడింది. అధిష్ఠానం జోక్యంతో ఇవాళ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేసుకున్నారు. తమ మధ్య ఎలాంటి విబేధాలు లేవని, ఇద్దరం కలిసికట్టుగా పనిచేస్తామని సమావేశం అనంతరం వారు విడివిడిగా ప్రకటించారు. ఈ క్రమంలో ఇవాళ మధ్యాహ్నం తన నివాసం నుంచి బయలుదేరిన డీకే శివకుమార్‌ను మీడియా పలుకరించగా.. ఇవాళ తన కుమార్తెను కలిసేందుకు కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ ఇంటికి వెళ్తున్నానని చెప్పారు. ఇవాళ ఆయన ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఉన్నదని తెలిపారు. డీకే శివకుమార్ తన కుమార్తె ఐశ్వర్యను ఎస్ఎం కృష్ణ మనవడు, అమర్త్య హెగ్డేకు ఇచ్చారు. అమర్త్య హెగ్డే కేఫ్ కాఫీ డే వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ కుమారుడు. ఎస్ఎం కృష్ణ కుమారుడైన వీజీ సిద్ధార్థ అప్పుల భారం పెరగడంతో నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా, కేంద్ర మంత్రిగా పనిచేసిన ఎస్ఎం కృష్ణ 2024 డిసెంబర్ 10న కన్నుమూశారు.

అన్‌మోల్ బిష్ణోయ్ కస్టడీ పొడగింపు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 29: పేరుమోసిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ ఎన్ఐఏ కస్టడీ ని మరో ఏడు రోజులు పొడిగించారు. ఈ నెల 19న విధించిన 11 రోజుల కస్టడీ గడువు నేటితో ముగియడంతో.. మరో ఏడు రోజులు కస్టడీ పొడిగించారు. అంటే డిసెంబర్ 5 వరకు అన్మోల్ కస్టడీ కొనసాగనుంది. అయితే భద్రతాకారణాల రీత్యా అన్మోల్‌ను ఎన్ఐఏ కోర్టుకు తీసుకెళ్లలేదు. అన్మోల్ చంపేస్తామంటూ బెదిరింపులు రావడంతో జడ్జి స్వయంగా ఎన్ఐఏ హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్లాడు. అక్కడ విచారణ జరిపి ఎన్ఐఏ అధికారుల మేరకు అన్మోల్ కస్టడీని పొడిగించారు. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్య కేసులో, సల్మాన్ ఖాన్ ఇంటిపై కాల్పుల కేసులో అన్మోల్ నిందితుడిగా ఉన్నారు.

బిహార్‌లో బీజేపీ నేతపై కాల్పులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 29: గుర్తు తెలియని వ్యక్తులు బీజేపీ సీనియర్ నేతపై కాల్పులు జరిపారు. ఛాతిలోకి బుల్లెట్లు చొచ్చుకెళ్లిన ఆయనను హాస్పిటల్‌కు తరలించారు. ఆ బీజేపీ నేత ఆరోగ్య పరిస్థితి చాలా విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. ఈ విషయం తెలిసి స్థానిక బీజేపీ నేతలు, కార్యకర్తలు షాక్ అయ్యారు. మరోసారి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన బీహార్‌లోని ఖగారియా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఖగారియా బీజేపీ యూనిట్‌లో ప్రముఖ నేత దిలీప్ కుమార్. పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి అయిన ఆయన ప్రస్తుతం మండల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. కాగా, శుక్రవారం పట్టపగలు గంగౌర్ ప్రాంతంలో బీజేపీ నేత దిలీప్ కుమార్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఛాతిలో బుల్లెట్లు చొచ్చుకెళ్లడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తొలుత ఖగారియా సదర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి చాలా విషమంగా ఉన్నదని డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ సంఘటనపై పోలీసులు స్పందించారు. బీజేపీ నేత దిలీప్ కుమార్‌పై కాల్పులు జరిపిన నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. నిందితులను గుర్తించిన తర్వాతమే ఆయనపై ఎందుకు కాల్పులు జరిపారు అన్నది దర్యాప్తులో తెలుస్తుందన్నారు. కాగా, ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

అల్ ఫలాహ్ వర్సిటీ 22వ రూమ్‌లో 18 లక్షల డబ్బు

- స్వాధీనం చేసుకున్న ఎన్ఐఏ అధికారులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 29: దేశ రాజధాని ఢిల్లీలో సంచలనం రేపిన కారు బాంబ్ బ్లాస్ట్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నది. ఇందులో భాగంగా నిందితురాలైన షహీద్ సయీద్‌ను అల్ ఫలాహ్ యూనివర్సిటీకి అధికారులు తీసుకెళ్లారు. ఆమెకు కేటాయించిన రూమ్ నంబర్ 22లో సోదా చేయగా రూ.18 లక్షల డబ్బు బయటపడింది. గురువారం ఎన్ఐఏ అధికారులు అల్ ఫలాహ్ క్యాంపస్‌ను తనిఖీ చేశారు. నిందితురాలు షహీద్ సయీద్ సమక్షంలో ఆమె నివసించిన రూమ్ నంబర్ 22తో పాటు ఆమె క్యాబిన్, ఆమె బోధించిన తరగతి గదులను పరిశీలించారు. ఒక అల్మారాలో ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి దాచిన రూ.18 లక్షల డబ్బును ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బు షహీద్ సయీద్‌కు ఎక్కడి నుంచి వచ్చింది అన్నది దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో మెట్రో స్టేషన్ వద్ద ఆత్మాహుతి కారు బాంబు పేలుడు జరిగింది. ఈ సంఘటనలో 15 మంది మరణించగా 20 మందికిపైగా గాయపడ్డారు. ఈ కేసులో నిందితులైన ముజమ్మిల్ షకీల్, అదీల్ అహ్మద్‌తో పాటు షహీద్ సయూద్‌ను శనివారం కోర్టులో హాజరుపర్చారు.





గోల్స్ తో దద్దరిల్లిన మలేషియా

- కెనడాపై విజయంతో ఫైనల్ చేరిన హాకీ ఇండియా

మలేషియా వేదికగా జరుగుతున్న సుల్తాన్ అజ్లాన్ షా కప్ లో ఆదరగొడుతున్న భారత హాకీ జట్టు ఫైనల్ చేరింది. లీగ్ దశ నుంచి గోల్స్ వర్షంతో ప్రత్యర్థులకు చెక్ పెడుతూ వచ్చిన టీమిండియా కెనడా ను భారీ తేడాతో చిత్తు చేసింది. శనివారం జరిగిన సెమీ ఫైనల్లో డిఫెండర్లు, ఫార్వర్డ్స్ సమిష్టిగా రాణించగా 143తో ప్రత్యర్థిని ఓడించి రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. ఇప్పటికే ఐదుసార్లు విజేతగా నిలిచిన టీమిండియా.. ట్రోఫీ కోసం ఆదివారం బెల్జియంతో తలపడనుంది. ఏకపక్షంగా సాగిన సెమీఫైనల్లో భారత జట్టు 143తో కెనడాను చిత్తు చిత్తుగా ఓడించింది. శనివారం ఆట ఆరంభమైన నాలుగో నిమిషంలోనే నీలకంఠ శర్మ గోల్ అందించాడు. కాసేపటికే రాజేందర్ సింగ్ గోల్ సాధించాడు. 20తో టీమిండియా ఆధిక్యంలో ఉండగా.. 11వ నిమిషంలో కెనడా ప్లేయర్ బ్రెండన్ గురాలిక్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. అయితే.. ప్రత్యర్థికి షాకిస్తూ ఫార్వర్డ్ ఆటగాళ్లు జుగురాజ్ సింగ్, అమిత్ రోహిదాస్‌లు తలొక గోల్ చేయగా తొలి అర్ధభాగంలో భారత్ 41తో ఆధిక్యం కనబరిచింది. రెండో క్వార్టర్స్‌లోనూ టీమిండియా ఆటగాళ్లు జోరు చూపించారు. మూడో అర్ధ భాగంలో కెనడా మరో గోల్ చేసినా... అప్పటికే భారత్ 92తో ముందంజలో ఉంది. 56వ నిమిషంలో సంజయ్, 57, 59 నిమిషాల్లో అభిషేక్ రెండు గోల్స్‌తో మెరిశాడు. దాంతో.. 143తో కెనడాను మట్టికరిపించిన భారత్ ఫైనల్లో అడుగుపెట్టింది. లీగ్ దశలో బెల్జియం చేతిలో కంగుతిన్న హర్మన్‌ప్రీత్ సింగ్ సేన ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే కసితో ఉంది. 1985, 1991, 1995, 2009, 2010లో ఛాంపియన్‌గా కప్‌ను అందుకున్న భారత్.. 2008, 2016, 2019 ఎడిషన్లలో మాత్రం రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

రాంచీలో నేడే తొలి వన్డే

- సచిన్ రికార్డు ఛేదించే దిశగా విరాట్ కోహ్లీ

భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్ రేపటి నుంచే మొదలవ్వనుంది. టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌తో పరువు పోగొట్టుకున్న టీమిండియా 50 ఓవర్ల ఫార్మాట్లో విజయంతో మురవాలనే కసితో ఉంది. అనుభవజ్ఞులైన విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ స్క్వాడ్‌తో కలవడం జట్టు బలాన్ని పెంచింది. ఆస్ట్రేలియా గడ్డపై ఆఖరి వన్డేలో దంచేసిన ఈ ద్వయం.. ఇప్పుడు స్వదేశంలోనూ సత్తా చాటాలనే కసితో ఉంది. రాంచీలో ఆదివారం జరుగబోయే తొలి వన్డే కోసం రన్ మెషీన్ విరాట్ సుదీర్ఘ సమయం నెట్స్‌లో చెమటోడ్చాడు. రాంచీలో శతకం సాధించాడంటే ఈ ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలతో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 'ఆల్‌టైమ్ రికార్డు'ను కోహ్లీ అధిగమిస్తాడు.వరల్డ్ క్లాస్ బ్యాటర్ అయిన కోహ్లీ కొత్తగా నిరూపించుకోవాల్సిందేమీ లేదు. కానీ, వచ్చే వన్డే ప్రపంచకప్ ఆడాలంటే ప్రతి మ్యాచ్‌లోనూ నిలకడగా రాణించాల్సి ఉంది. ఆసీస్ పర్యటనలో రెండు డకౌట్ల తర్వాత ఆఖరి వన్డేలో అజేయ అర్ధ శతకం బాదిన విరాట్.. ఇప్పుడు స్వదేశంలో చెలరేగిపోవాలనే పట్టుదలతో ఉన్నాడు. రెండేళ్ల క్రితం వన్డే ప్రపంచ కప్‌లో న్యూజిలాండ్‌పై సూపర్ సెంచరీతో సచిన్ టెండూల్కర్ రికార్డు (49 శతకాలను) సమం చేసిన కోహ్లీ.. దక్షిణాఫ్రికాపై అలాంటి భారీ ఇన్నింగ్స్ ఆడాలని భారత కెప్టెన్ రాహుల్, కోచ్ గంభీర్ ఆశిస్తున్నారు.



ఇంగ్లండ్‌కు మరో షాక్

- పింక్ బాల్ టెస్ట్‌కు దూరమైన స్టార్ పేసర్

యాషెస్ సిరీస్‌ను భారీ ఓటమితో ఆరంభించిన ఇంగ్లండ్ కు మరో షాక్. ఐదు టెస్టుల సిరీస్‌లో 01తో వెనకబడిన ఆ జట్టు ప్రధాన పేసర్ మార్క్ వుడ్ సేవల్ని కోల్పోనుంది. మ్యాచ్ విన్నర్ అయిన ఈ స్పీడ్‌స్టర్ అనూహ్యంగా రెండో టెస్టుకు దూరమయ్యాడు. మోకాలి గాయంతో ఇబ్బందిపడుతున్న వుడ్ బ్రిస్బేన్‌లోని గబ్బాలో జరిగే డే - నైట్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడం లేదు. దాంతో.. ఎలాగైనా సిరీస్ సమం చేయాలనుకున్న బెన్ స్టోక్స్ బృందానికి ఇది పెద్ద ఎదురుదెబ్బ అనే చెప్పాలి. ఫిబ్రవరిలో చివరి టెస్టు ఆడిన వుడ్.. మోచేతి గాయం నుంచి కోలుకొని ఇటీవలే స్క్వాడ్‌లోకి వచ్చాడు. పదునైన స్వింగ్, లైన్ అండ్ లెంగ్త్‌తో ఆసీస్ బ్యాటర్లను వుడ్ బోల్తా కొట్టిస్తాడని ఇంగ్లండ్ అతడిపై భారీ ఆశలు పెట్టుకుంది. కానీ, పెర్త్ టెస్టులో ఈ సీనియర్ పేసర్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి అతడు కేవలం 11 ఓవర్లే వేశాడు. మిచెల్ స్టార్క్, ట్రావిస్ హెడ్ మెరుపులతో రెండో రోజే పెర్త్ టెస్టు ముగిసింది. దాంతో.. 104 ఏళ్ల చరిత్రలో యాషెస్ టెస్టు ఇంత త్వరగా పూర్తవ్వడం ఇదే మొదటిసారి. బ్రిస్బేన్ టెస్టుకు మార్క్ వుడ్ అందుబాటులో లేకపోవడంతో.. అతడి స్థానంలో యువ పేసర్ జోష్ టంగ్ (Josh Tongue)ను తీసుకునే అవకాశముంది. డిసెంబర్ 4న ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య బ్రిస్బేన్‌లోని గబ్బాలో పింక్ బాల్ టెస్టు డేనైట్ లో జరుగనుంది. మరోవైపు.. ఆతిథ్య జట్టు కూడా కెప్టెన్ ప్యాట్ కమిన్స్, పేసర్ హేజిల్‌వుడ్‌లు రెండో టెస్టుకు దూరమైన విషయం తెలిసిందే.

సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్‌టోర్నీ ఫైనల్‌కు చేరిన కిడాంబి శ్రీకాంత్

ప్రతిష్ఠాత్మక సయ్యద్ మోడీ ఇంటర్నేషన్ లో కిడాంబి శ్రీకాంత్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో భారత్‌కే చెందిన మిథున్ మంజునాథన్ ను ఓడించి టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. ఈ టోర్నీలో సంచలన విజయాలతో వార్తల్లో నిలిచిన యువ షట్లర్ తన్వీ శర్మ కు మాత్రం చుక్కెదురైంది. మరో భారత అమ్మాయి ఉన్నాటి హుడా సైతం సెమీఫైనల్లోనే ఇంటిదారి పట్టింది. సయ్యద్ మోడీ ఇంటర్నేషన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ జోరు కొనసాగుతోంది. తొలి రౌండ్ నుంచి చెలరేగి ఆడుతున్న అతడు.. సెమీస్‌లోనూ విజృంభించగా మితున్ మంజునాథన్ చేతులెత్తేశాడు. తొలి సెట్ 2115తో గెలుపొందిన శ్రీకాంత్‌కు మితున్ గట్టిపోటీనిస్తూ రెండో సెట్ కైవసం చేసుకున్నాడు. కానీ, నిర్ణయాత్మక మూడో సెట్‌లో మాత్రం మాజీ ఛాంపియన్ ధాటికి మితున్ నిలువలేకపోయాడు. 2113తో చివరి సెట్ గెలుపొందిన శ్రీకాంత్ టైటిల్ పోరులో తనకంటే తక్కువ ర్యాంకర్ జేసన్ గునవాన్‌ను ఢీకొట్టనున్నాడు. ఈ టోర్నీలో నమ్మశక్యంకాని ఆటతో ప్రత్యర్థులకు చెక్ పెట్టిన తన్వీ శర్మ సెమీస్‌లో తడబడింది. క్వార్టర్స్‌లో సిన్ యాన్ హ్యాపీని ఓడించిన తను హీనా హకేచి చేతిలో 1721, 1621తో ఓటమి పాలైంది. అతి కష్టమ్మీద సెమీస్ బెర్తు సాధించిన ఉన్నాటి.. 1520, 1021తో టర్కీ షట్లర్ నెలిషాన్ అర్న్ చేతిలో కంగుతిన్నది. అంతకంటే ముందు జరిగిన మహిళల డబుల్స్ సెమీస్‌లో భారత ద్వయం త్రీసా జాలీ, గాయత్రీ గోపిచంద్ అదరగొట్టింది. మలేషియా జంట ఓంగ్ గ్జిన్ యీ, కర్మెన్ టింగ్‌ను 2111, 2115తో మట్టికరిపించింది.

మన కల్చర్, నేచర్‌ను మనమే కాపాడుకోవాలి..

ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో నవదీప్ పల్లపోలి, సాయి దుర్గ తేజ్ సారథ్యంలో శ్రీకాంత్ మన్నెపురి 'డిస్కవర్ ఆంధ్ర' డాక్యుమెంటరీని తెరకెక్కించారు. ఈ ప్రాజెక్ట్‌ని పడాల సురేందర్ రెడ్డి, శ్రావ్య కూనం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీ టైటిల్, గ్లింప్స్ లాంఛ్‌ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ .. 'శ్రీకాంత్ కోసం ఇక్కడకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఆంధ్రను ఇంత అద్భుతంగా చూపిస్తున్న శ్రీకాంత్ గారికి థాంక్స్. మన చుట్టూనే ఇన్ని అద్భుతాలు ఉన్నాయా? అని అందరూ ఆశ్చర్యపోతారు. 2020లో నాకు ఈ వైల్డ్ లైఫ్ గురించి ఎక్కువగా ఆలోచనలు వచ్చాయి. అందుకే 'గ్రీన్ పాస్' అనే ఎన్జీవోని నా స్నేహితుడితో కలిసి ప్రారంభించాను. బీచ్ క్లీన్ చేయడం, కోస్టల్ ఏరియాలోని జీవుల్ని, పక్షుల్ని రక్షించే ప్రయత్నం చేస్తున్నాం. మన చుట్టూ ఉన్న ఈ వైల్డ్ లైఫ్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే. 'రిపబ్లిక్' చిత్రంలోనూ పర్యావరణం గురించి, దాన్ని కాపాడుకునే విషయాల గురించి చాలా చెప్పాం. ఈ మూవీలో మన వైల్డ్ లైఫ్ గురించి మనకు ఎంతో అద్భుతంగా చెప్పబోతోన్నారు. మన కల్చర్, మన నేచర్‌ను మనమే కాపాడుకోవాలి. శ్రీకాంత్‌కు పెద్ద విజయం దక్కాలి. ఈ ప్రాజెక్ట్‌కు పని చేసిన ప్రతీ ఒక్కరికీ ఆల్ ది బెస్ట్. మణిశర్మ గారు ఈ ప్రాజెక్ట్‌కి సపోర్ట్ చేయడం ఆనందంగా ఉంది. ఇలాంటి ప్రాజెక్ట్ లకు మీడియా, ఆడియెన్స్ సపోర్ట్ చేయాలి' అని అన్నారు.

'పెద్ది' ఫైటింగ్ కోసం
భారీ సెట్

బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చేస్తున్న రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'పై ఉన్న అంచనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్‌కు, 'చికిరి' పాటకు వచ్చిన అద్భుతమైన స్పందన గురించి అందరికీ తెలిసిందే. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మాత.. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్ఠాత్మకంగా సమర్పిస్తున్న 'పెద్ది'ని భారీ బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం 'పెద్ది' బృందం రామ్ చరణ్, ఇతర ఫైటర్లతో పాటు కీలకమైన, హై-ఇంటెన్సిటీ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తోంది. ఈ షూటింగ్‌లో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కూడా పాల్గొంటున్నారు. హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా భారీ సెట్‌ను నిర్మించారు. అక్కడ ఈ భారీ యాక్షన్ బ్లాక్‌కు సంబంధించిన చిత్రీకరణ జరుగుతోంది. బాలీవుడ్ స్టార్ విక్కీ కౌశల్ తండ్రి, ప్రముఖ స్టంట్ డైరెక్టర్ 'దంగల్' ఫేమ్ షామ్ కౌశల్ ఈ హై-ఇంటెన్సిటీ యాక్షన్ సీక్వెన్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. నవకాంత్ స్టంట్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సీక్వెన్స్ సినిమాకి హైలైట్ కానుందని, అందుకే మేకర్స్ షామ్ కౌశల్‌ను సంప్రదించారు. ఈ సీక్వెన్స్‌కు సినిమాలో ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అందుకే ఈ చిత్రీకరణను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా పర్ఫెక్షనిస్ట్ అన్నసంగతి తెలిసిందే. ప్రతి యాక్షన్ సెగ్మెంట్ పైనా చాలా శ్రద్ధ చూపిస్తుంటారు. ప్రతి ఫైట్ సీక్వెన్స్‌ను ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో, ఉత్కంఠభరితంగా ఉండేలా రూపొందిస్తున్నారు. ఇక ఇప్పటికే 'పెద్ది' ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' ప్రపంచవ్యాప్తంగా 110 మిలియన్ల మార్కును దాటి వరల్డ్ వైడ్‌గా టాప్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ పాట ప్రపంచవ్యాప్తంగా ఇంకా ట్రెండ్ అవుతూనే ఉంది. అంతే కాకుండా ఈ సంవత్సరం బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ చార్ట్ బస్టర్లలో ఒకటిగా నిలిచింది. ఈ చిత్రంలో జగపతిబాబు, దివ్యేందు శర్మ కూడా ప్రముఖ పాత్రల్లో నటిస్తున్నారు. 'పెద్ది' కోసం అకాడమీ అవార్డు గ్రహీత ఎఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ ఆర్ రత్నవేలు కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ఎడిటర్ నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు చూసుకుంటున్నారు.

'అఖండ తాండవం'లో ఎక్కువ హై మూమెంట్స్ ఉంటాయి

ఆది పినిశెట్టి

గాడ్ ఆఫ్ మాస్ నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ మీద ఎం తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించిన ఈ మూవీని డిసెంబర్ 5న విడుదల చేయబోతోన్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా అభిమానుల్లో, ఆడియెన్స్‌లో అంచనాల్ని పెంచేశాయి. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా శనివారం నాడు విలక్షణ నటుడు ఆది పినిశెట్టి మీడియాతో ముచ్చటించారు. ఆయన ఈ చిత్రం గురించి చెప్పిన సంగతులివే..

బోయపాటి శ్రీనుతో రెండో సారి పని చేస్తున్నారు కదా? ఏం తేడా గమనించారు?

బోయపాటి శ్రీను దర్శకత్వంలో నేను 'సరైనోడు' చిత్రంలో వైరం ధనుష్ అనే పాత్రను పోషించాను. అందులోని పాత్రకి 'అఖండ 2'లో నేను పోషించిన కారెక్టర్‌కు చాలా తేడా ఉంటుంది. ఇలాంటి పాత్రను పోషించడం నాకు కూడా కొత్తే. ఆడియెన్స్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందా? అని నేను కూడా ఎదురుచూస్తున్నాను. మంత్రతంత్రాల చుట్టూ తిరిగే పాత్రలు నేను చేయలేదు.

'అఖండ 2' కథను బోయపాటి మీకు ఎప్పుడు చెప్పారు?

మంత్రతంత్రాల చుట్టూ తిరిగే పాత్రలు నేను చేయలేదు. నేను కథ వినకుండా ఓకే చేసిన మొదటి చిత్రం 'అఖండ 2'. బోయపాటి గారి మీద నాకు చాలా నమ్మకం ఉంది. ఆయన సత్తా ఏంటో నాకు తెలుసు. బాలయ్య గారికి ఎదురుగా అంటే సరిపోతానా? అని అడిగాను. పర్‌ఫెక్ట్‌గా ఉంటారు అని ఆయన అన్నారు. సెట్‌కి వెళ్లిన తరువాతే నాకు ఆ వాతావరణం, కథ తెలిసింది.

'అఖండ 2'లో మీ పాత్ర ఎలా ఉంటుంది?

బోయపాటి నా పాత్రను వివరించిన తరువాత చాలా కన్ఫ్యూజ్ అయ్యాను. వైరం ధనుష్‌లాంటి పాత్రలు అయితే సొంతంగా ఊహించుకుని చేసుకోవచ్చు. కానీ ఇందులో పోషించిన పాత్ర మాత్రం నాకు ఓ ప్రయోగం లాంటిదే. ఇందులోని ప్రతీ పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఆడియెన్స్ ఎలా రెస్పాన్స్ ఇస్తారో చూడాలి.

బాలయ్యతో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ చెప్పండి?

బాలయ్య గురించి బయట చాలా వింటుంటాం. కానీ సెట్‌లో ఆయన ఎనర్జీ వేరేలా ఉంటుంది. ఆయన ఉంటే సెట్‌లో పాజిటివ్ వైబ్స్ కనిపిస్తాయి. మా నాన్న తో వర్క్ ఎక్స్‌పీరియెన్స్‌ని కూడా నాతో పంచుకున్నారు. ఆయన ఎనర్జీని మ్యాచ్ చేయడం చాలా కష్టం. ఆయనకు ప్రతి నాయకుడిగా నేను సరిపోతానా? అని అడిగాను. కానీ నన్ను బోయపాటి నమ్మారు.

'అఖండ 2'లో ఎలాంటి అంశాలు ఎక్కువగా ఉంటాయి? ఏ మూమెంట్స్‌కి ఆడియెన్స్ ఎగ్జైట్ అవుతారు?

'అఖండ' కంటే 'అఖండ తాండవం'లో హై మూమెంట్స్ ఎక్కువగా ఉంటాయి. బాలయ్య యాక్షన్, బోయపాటి మేకింగ్, తమన్ మ్యూజిక్, ఎలివేషన్స్‌ని చూస్తే పదివేల వాట్స్ కరెంట్ షాక్ కొట్టినట్టుగా ఉంటుంది. వావ్ అనిపించేలా, ఆశ్చర్యపోయేలా ఎన్నో అంశాల్ని చూపించబోతోన్నారు. అదే 'అఖండ 2' ప్లస్ పాయింట్.

తమన్ సంగీతం, నేపథ్య సంగీతం గురించి చెప్పండి?

తమన్ మామూలుగా కొడితేనే బాక్సులు బద్దలు అవుతుంటాయి. ఇక బాలయ్య తమన్ ఏ రేంజ్‌లో కొడతారో చెప్పాల్సిన పని లేదు. నా సీన్లకు కూడా ఈ సారి మ్యూజిక్ అదిరిపోతుంది. తమన్ తన ఆర్ఆర్‌తో అదరగొట్టబోతోన్నారు. నేను కూడా స్క్రీన్ మీద ఆ మ్యాజిక్‌ను చూడాలని ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను.

ప్రొడక్షన్ వాల్యూస్, నిర్మాతలైన రామ్ ఆచంట, గోపీ ఆచంట గురించి చెప్పండి?

ఎన్నో డిఫరెంట్ లొకేషన్స్‌లో ఇంత భారీ బడ్జెట్‌తో సినిమాను నిర్మించడం మామూలు విషయం కాదు. 14 రీల్స్ మాత్రం ఎన్నో జాగ్రత్తలు తీసుకుని ఈ మూవీని గొప్పగా నిర్మించింది. ఎవ్వరికీ ఎప్పుడు కూడా పేమెంట్స్ విషయంలో ఆలస్యం చేయలేదు. ఇలాంటి ప్రొడక్షన్ కంపెనీ, రామ్ ఆచంట, గోపీ ఆచంట వంటి నిర్మాతలతో మళ్లీ మళ్లీ పని చేయాలని కోరుకుంటున్నాను.

బాలయ్యలో మీరు పర్సనల్‌గా చూసిన క్వాలిటీ ఏంటి?

బాలయ్య గారితో మా నాన్న గారు పని చేశారు. బాలయ్య గారు ముక్కు సూటి మనిషి అని మా నాన్న చెబుతుంటారు. లోపల ఒకటి పెట్టుకుని బయటకు ఇంకోటి మాట్లాడే మనస్తత్వం కాదు. అలాంటి క్వాలిటీ చాలా అరుదుగా ఉంటుంది.

'అఖండ 2' రిజల్ట్ ఎలా ఉండబోతోందని మీరు భావిస్తున్నారు?

'అఖండ తాండవం' చాలా బాగా వచ్చింది. ఆడియెన్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఇక ప్రేక్షకులు ఎలాంటి ఫలితాన్ని ఇస్తారో అని వెయిటింగ్ చేస్తున్నాను.

భవిష్యత్తు ప్రాజెక్ట్‌లు ఏంటి?

'థండర్' అనే స్పోర్ట్స్ డ్రామాని తమిళ, తెలుగు భాషల్లో చేస్తున్నాను. 'మరకతమణి' సీక్వెల్ చేస్తున్నాను. కార్తీతో కలిసి 'మార్షల్' మూవీని కూడా చేస్తున్నాను.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200